


పీలేరు చెన్నారెడ్డి వీధిలో పేపర్ గుజ్జుతో తయారు చేసిన వినాయకుడు

వచ్చాడయ్యో... సామీ...


- ఊరూ.. వాడా.. కొలువుదీరిన గణనాథులు
- యువతలో వెల్లివిరిసిన ఆనందం



పీలేరు సుధాసుధీర్ వీధిలో ఏర్పాటు చేసిన బంక మట్టి వినాయకుడు



శివాలయం సెంటర్‌లో కాళీయుడిపై నాట్యం చేస్తున్న వినాయకుడు



వాల్మీకిపురం కూరపర్తి గ్రామంలో 2.0 గణపతి

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): ఏ వ్రతం చేసినా.. ఏ శుభకార్యం ప్రారంభించినా తొలి పూజ ఏకదంతునికే. ఆ విఘ్ననాయకుడి ఆశీస్సులు తీసుకోకుండా అడుగు ముందుకు వేయరు. అందుకే వినాయకచవితి పర్వదినం అంటేనే భక్తుల్లో ఆనందం. ఆధ్యాత్మిక సంబరం. వినాయకచవితి పర్వదినాన్ని బుధవారం జిల్లా వ్యాప్తంగా అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. పల్లె, పట్టణం అనే తేడా లేకుండా జిల్లా అంతటా విగ్రహాలను వాడవాడలా ప్రత్యేకంగా అలంకరించిన మండపాలలో కొలువుదీర్చారు. అలాగే ప్రతీ ఇంట్లోను బొజ్జగణపతి ప్రతిమలను కొలువుదీర్చి వాటిని అందంగా అలంకరించి ఇష్టమైన నైవేద్యాలను సమర్పించి పండుగను జరుపుకున్నారు. మండపాల్లో కొలువుదీరిన విగ్రహాల వద్ద పిల్లలు, పెద్దలు, యువకులు ప్రత్యేక భక్తిగీతాలకు స్టెప్స్ వేసి సందడి చేశారు.

● రాయచోటిలో సుమారు 200 విగ్రహాలను ఏర్పాటు చేశారు. రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తన స్వగ్రామం చిన్నమండెం మండలం బోరెడ్డిగారిపల్లెలో కుటుంబ సభ్యులతో కలిసి వినాయకచవితి వేడుకలు జరుపుకున్నారు. అనంతరం రాయచోటి పట్టణంలో పలుచోట్ల ఏర్పాటు చేసిన విగ్రహాల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. మంత్రి సోదరుడు మండిపల్లి లక్ష్మి ప్రసాద్‌రెడ్డి, మంత్రి తనయుడు నిశ్చల్ నాగిరెడ్డి పలు విగ్రహాల వద్ద పూజల్లో పాల్గొన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ప్రసాద్‌బాబు పట్టణంలో ఏర్పాటు చేసిన పలు విగ్రహాల వద్ద పూజలు నిర్వహించారు.



రాయచోటిలో వినాయక పూజలో మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

● పీలేరు పట్టణంలో 182 కేంద్రాలలో వినాయక విగ్రహాలను ఏర్పాటు చేశారు. పండుగ రెండవ రోజు.. పలు విగ్రహాల వద్ద అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముస్లింలు కూడా భాగస్వాములయ్యారు. చెన్నారెడ్డి కాలనీ శివాజీ సెంటర్‌లో ఏర్పాటు చేసిన వినాయక ప్రతిమ ఈ ఏడాది అందరినీ ఆకట్టుకుంది. పర్యావరణ హితంతో కేవలం పేపర్ గుజ్జుతో తయారు చేసిన భారీ వినాయకుడిని ఆ కేంద్రంలో ప్రతిష్ఠించారు.



రాజంపేట, మదనపల్లెలో కొలువైన గణనాథులు

● మదనపల్లె పట్టణంలో కమ్మవీధి, బుగ్గకాలువ, చెంబకూరురోడ్డు, సాయిబాబగుడి, ఆర్యవైశ్యకళ్యాణ మండపం, త్యాగరాజవీధి, ప్రశాంత్‌నగర్, బొంబుబజార్, మార్వారివీధి, కమ్మగడ్డవీధి, రెడ్డీస్ కాలనీ, రెడ్డెప్పనాయుడు, సుభాష్‌రోడ్డులలో గణపయ్యలు కొలువుదీరారు. మదనపల్లె, తంబళ్లపల్లె నియోజకవర్గాలలో ప్రతి పల్లెలోనూ.. వినాయకచవితి వేడుకలు సంతోషంగా నిర్వహించారు. మదనపల్లెలో తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు జి.శ్రీరాంచినబాబు, టీడీపీ నేతలు కోపూరి మల్లికార్జుననాయుడు, జనసేన నేతలు గంగారపు రామ్‌దాస్‌చౌదరి, శ్రీరామ రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

● రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాలలో వినాయక చవితి ఉత్సవాలు ఘనంగా జరుపుకున్నారు. రాజంపేట పట్టణంలోని శివాలయం వీధి, ఆర్ఎస్ రోడ్డు, నూనెవారిపల్లెరోడ్డు, ఎర్రబల్లి తదితర ముఖ్య ప్రాంతాలలో విగ్రహాలను ఏర్పాటు చేసి ఘనంగా ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. కోడూరు, చిట్వేలి, పుల్లంపేట, నందలూరు, ఒంటిమిట్ట, సిద్దవటం, ఓబులవారిపల్లె, పెనగలూరు తదితర ప్రాంతాలలోనూ.. ప్రతి గ్రామంలో విగ్రహాలను ఏర్పాటు చేసి అంగరంగ వైభవంగా ఉత్సవాలు నిర్వహిస్తున్నారు.

చవితి వేడుకల్లో అపశ్రుతి

పీలేరులో జరిగిన చవితి వేడుకల్లో చిన్న అపశ్రుతి జరిగింది. స్థానిక బీవీ రెడ్డి కాలనీ సమీపంలో ఆర్యవైశ్య యూత్ ఏర్పాటు చేసిన మండపం పూర్తిగా అగ్నికి ఆహుతైంది. పర్యావరణ హితంగా ఉండాలన్న లక్ష్యంతో ఆ సెంటర్‌లోని వినాయకుడిని కోయంబత్తూరు నుంచి పిలిపించిన ప్రత్యేక కళాకారులతో గంధం, పత్తితో తయారు చేశారు. స్వామి వారికి బుధవారం ఉదయం హారతి ఇచ్చే సమయంలో గాలి ఎక్కువగా వీయడంతో హారతి మంటలు విగ్రహంలోని పత్తికి అంటుకున్నాయి. దీంతో కేవలం నిమిషం వ్యవధిలో మండపం పూర్తిగా కాలి బూడిదైంది. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ప్రమాదం నుంచి తేరుకున్న ఆర్యవైశ్య యూత్ మళ్లీ మరో మండపాన్ని హుటాహుటిన ఏర్పాటు చేసి వినాయకుడిని కొలువు దీర్చారు.



మంటలకు ఆహుతైన పీలేరు బీవీ రెడ్డి సెంటర్ మండపం

పారిశుధ్య నిర్వహణపై శ్రద్ధ చూపాలి

● డీపీవో రాధమ్మ



వర్మీ కంపోస్టు తయారీపై సూచనలిస్తున్న డీపీవో రాధమ్మ

కలకడ, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్యం నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధచూపాలని డీపీవో రాధమ్మ సిబ్బందిని ఆదేశించారు. గురువారం కలకడ డంపింగ్ యార్డును సందర్శించిన ఆమె మాట్లాడుతూ వర్షాలకు దోమలు వ్యాప్తి చెందకుండా వీధుల్లో మురికినీరు నిల్వ లేకుండా జాగ్రత్త వహించాలన్నారు. తాగునీరు కలుషితం కాకుండా పైప్‌లైన్లు, గేట్‌వాల్వ్ వద్ద లీకేజీలను అరికట్టాలన్నారు. క్రమం తప్పకుండా ప్రతి ఇంటి నుంచి తడి, పొడిచెత్తను విడివిడిగా సేకరించి డంపింగ్ యార్డుకు తరలించాలన్నారు. కేంద్రంలో వర్మీ కంపోస్టు తయారీ, అమ్మకం గురించి ఆరా తీశారు. స్వామిత్వ కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం బాటవారిపల్లె, బాలయ్యగారిపల్లె పంచాయతీలో చెత్త సేకరణను క్షేత్రస్థాయిలో పరిశీలించి సిబ్బందికి సూచనలిచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో ప్రతాప్‌రెడ్డి, కార్యదర్శి దేవేంద్ర, నందిని పాల్గొన్నారు.

పండుగ రోజూ తప్పని బదిలీలు

● 10 మంది వీఆర్వోలకు మళ్లీ స్థానచలనం

కలికిరి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి కానుకగా కొందరు వీఆర్వోలకు జిల్లా అధికారులు బదిలీల పేరుతో బహుమానాలిచ్చారు. పండుగకు ముందు రోజు మంగళవారం రాత్రి జిల్లాలోని 10 మంది వీఆర్వోలను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అయితే డిప్యుటేషన్ల పేరుతో ఈ బదిలీలను చేపట్టారు. దాదాపు ఏడాది నుంచి వీఆర్వోల బదిలీల పరంపర కొనసాగుతూనే ఉంది. గత ఏడాది బదిలీలపై నిషేధం సడలించిన నేపథ్యంలో సెప్టెంబరులో మూడు జాబితాలు, ఆ తరువాత తిరిగి అక్టోబరులో మరో నాలుగు జాబితాలు విడతల వారీ జారీ చేశారు. తాజాగా జూలై 26న కొందరిని బదిలీ చేయగా తిరిగి ఈనెల 4న మరో విడత జాబితాను విడుదల చేశారు. వీటన్నిటికీ కొనసాగింపుగా ఈనెల 20న కొందరిని డిప్యుటేషన్ల పేరుతో బదిలీ చేయగా వీటన్నింటికీ కొనసాగింపుగా మంగళవారం రాత్రి 10 మంది వీఆర్వోల డిప్యుటేషన్లతో మరో జాబితా విడుదలైంది. వీరంతా గతంలో వివిధ జాబితాల్లో చోటు పొంది, అనంతరం మార్పులు పొంది చివరగా డిప్యుటేషన్ల విధానంలో స్థానచలనానికి గురయ్యారు. ఈ బదిలీలపైన తిరిగి రిక్వెస్టులు ఉండవని అంతేగాకుండా ఈ డిప్యుటేషన్లపై ఏ విధమైన నిరసనలను ఉపేక్షించబోమని హెచ్చరించడం కొసమెరుపు. కలెక్టరు ఆమోదంతో డిప్యుటేషన్ ఉత్తర్వులు జారీ చేస్తున్నట్లు డీఆర్‌వో కె.మధుసూదనరావు తెలిపారు.

ఉద్యాన సాగుపై మక్కువ చూపాలి

● డ్వామా పీడీ వెంకటరత్నం



ఉపాధి పనులను పరిశీలిస్తున్న పీడీ వెంకటరత్నం

పీలేరు రూరల్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ఉద్యాన పంటల సాగుపై రైతులు మక్కువ చూపాలని డ్వామా పీడీ వెంకటరత్నం తెలిపారు. గురువారం ఆయన కేవీపల్లె మండలం వగళ్ల, కేవీపల్లె పంచాయతీలలో జరుగుతున్న ఉపాధి పనులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో రైతులకు ఉద్యాన పంటల సాగుకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకుని పంటల సాగు కోసం ప్రత్యేక చొరవ చూపాలన్నారు. మామిడిలో రైతులకు గిట్టుబాటు ధర రావాలంటే మంచి దిగుబడి ఇచ్చే ఇమాంపసందు, కేసర, బెంగళూరు తదితర మంచి రకాలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. మొక్కల సంరక్షణకు ప్రభుత్వం మూడు సంవత్సరాలకు నీళ్ల పోయడానికి, దుక్కులు దున్నడానికి, ఎరువులు, అంతర పంటల సాగు, కంచె వేయడం కోసం అవసరమైన నిధులు ఇస్తుందని తెలిపారు. రకరకాల ఉద్యాన పంటల సాగుకోసం రైతులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కేవీపల్లె పంచాయతీలో సిద్దయ్య పొలంలో జరుగుతున్న సేద్యపు కుంట పనులను పరిశీలించారు. కార్యక్రమంలో ఏపీవో నాగరాజు, ఈసీ వెంకటేశ్వర్లు, టెక్నికల్ అసిస్టెంట్లు యమున, గౌతమి, చంద్రబాబు, వెంకటరమణ, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

1న రాజంపేటకు సీఎం చంద్రబాబు రాక

- బోయనపల్లె వద్ద సమావేశానికి ఏర్పాట్లు
- ఏర్పాట్లు పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ, చమర్తి



ఏర్పాట్లపై టీడీపీ ఇన్‌చార్జ్ చమర్తి జగన్‌మోహన్‌రాజుతో కలిసి పరిశీలిస్తున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్



భద్రతా ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు, తదితరులు

రాజంపేట, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో భాగంగా సెప్టెంబరు 1వ తేదీ రాజంపేట మండలానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రానున్నారు. ఈ సందర్భంగా రాజంపేట మండలం కడప-రాజంపేట ప్రధాన రహదారి పక్కన అన్నమయ్య 108 అడుగుల విగ్రహం సమీపంలోని బోయనపల్లె ప్రాంతంలో పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని పంపిణీ చేయడానికి జిల్లా అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు అధికారిక ప్రకటన చేయనున్నారు. ఇందులో భాగంగా బుధవారం కలెక్టర్ చామకూరి శ్రీధర్, ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు, జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, రాజంపేట సబ్‌కలెక్టర్ భావన, డీఎస్పీ మనోజ్ రామ్‌నాథ్‌హెగ్డే, రాజంపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ చమర్తి జగన్‌మోహన్‌రాజు, ఇతర జిల్లా, డివిజనల్ ఉన్నతాధికారులు ఇందుకు సంబంధించి సీఎం ఏర్పాట్లపై పలు అంశాలు పరిశీలించారు. ప్రధానంగా తాళ్లపాక, బోయనపల్లె, ఎన్టీఆర్ కాలనీ, తదితర ప్రాంతాలను పరిశీలించారు. చివరగా బోయనపల్లె ప్రాంతంలో పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టాలని తుది నిర్ణయానికి వచ్చి ఏర్పాట్లను పరిశీలించారు. గురువారం ఎస్పీ విద్యాసాగర్‌నాయుడుతో పాటు రాజంపేట సబ్‌కలెక్టర్, ఏఎస్పీ బోయనపల్లెలో ఏర్పాట్లపై పరిశీలించారు. టీడీపీ ఇన్‌చార్జ్ చమర్తి జగన్‌మోహన్‌రాజు ద్వారా ఏర్పాట్లపై ఆరా తీశారు. ముఖ్యమంత్రి పెన్షన్ల పంపిణీ కార్యక్రమంతో పాటు స్థానికంగా ఉన్న భవన నిర్మాణ కార్మిక కుటుంబాలను, చేనేత కార్మిక కుటుంబాలను, రజక కార్మికులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకోనున్నారు. ఇందులో మూడు కుటుంబాలను స్వయంగా పరామర్శించి వారి సాధక బాధకాలను తెలుసుకోనున్నారు. ఈ మేరకు ఆ ప్రాంతాన్ని కూడా పరిశీలించి అందుకు సంబంధించిన కుటుంబాలను ఎంపిక చేశారు. ముఖ్యమంత్రి రాక సందర్భంగా భద్రతా ఏర్పాట్లను, హెలిప్యాడ్ ఏర్పాట్లను కూడా పరిశీలించారు. ప్రధానంగా నియోజకవర్గ టీడీపీ నాయకులు, కార్యకర్తలతో ప్రత్యేకంగా నిర్వహించనున్న సమావేశ ఏర్పాట్లపై కూడా అధికారులు ఆరా తీశారు. సీఎంవో కార్యాలయం నుంచి వచ్చిన అధికారులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఆ పట్టాలకు పరిష్కారమెప్పుడో...?

- రైల్వేకోడూరు మండలంలో 17 వేల అతుకుబడి పట్టాలు
- ఆగిపోయిన రిజిస్ట్రేషన్‌లు... దిక్కుతోచని స్థితిలో బాధితులు

6

రాయచోటి అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యం


- రాయచోటి మునిసిపాలిటీని నెంబర్-1గా తీర్చిదిద్దుతాం
- మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి

6


పింఛన్ కోసం దివ్యాంగుడి పోరాటం

కొప్పర్తికి పరిశ్రమల కళ

- కడప వైపు కంపెనీల చూపు
- ఉత్పత్తికి రెండు పరిశ్రమలు సిద్ధం
- 2,400 మందికి ఉపాధి
- 2న మంత్రి నారా లోకేశ్‌చే ప్రారంభం



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న టెక్నోడోమ్



కొప్పర్తిలో మంత్రి నారా లోకేశ్ చేతుల మీదుగా ప్రారంభానికి సిద్ధంగా ఉన్న పరిశ్రమలు

(కడప-ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వంతో కొప్పర్తికి మహర్దశ పడుతోంది. జగన్ హయాంలో కనీసం సొంత జిల్లాను కూడా అభివృద్ధి చేసుకోలేదు. దివంగత సీఎం రాజశేఖర్‌రెడ్డి కడప అభివృద్ధిలో తన మార్కు చూపించారు. జగన్ తానే 30 ఏళ్ల పాటు సీఎం అని చెప్పుకున్నారే కానీ.. సొంత జిల్లా అభివృద్ధిపై తన మార్కు చూపించ లేదు. అందుకే జనం కూడా ఎన్నికల్లో కర్రు కాల్చి వాత పెట్టారు. ఇప్పుడు కడప జిల్లా అభివృద్ధికి చంద్రబాబు ప్రభుత్వంపై చర్యలు చేపట్టింది.

జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు అనువైన వాతావరణం ఉంది. అయితే ఇక్క డ రాజకీయ నాయకులకు పర్సంటేజీలు, కంపెనీలలో బలవంతపు వాటా ఇచ్చే అవ సరం లేకపోతే పరిశ్రమలు పెద్దఎత్తున ఏర్పాటవుతాయి. వైసీపీ హయాంలో కొప్పర్తి లో పరిశ్రమలు ఏర్పాటు చేయాలంటే భాగ స్వామ్యం అడిగేవారని ఆరోపణలున్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక ఇదే ధోరణి కొనసాగుతోందని సమాచారం. దీంతో ఇక్కడ పరిశ్రమల స్థాపనకు ముందుకు రావడం లేదని తెలుస్తోంది. ఇప్పుడు చంద్రబాబు సర్కారు పరిశ్రమల ఏర్పాటు లక్ష్యంగా అడు గులు వేస్తోంది. పెద్దఎత్తున పరిశ్రమలు వచ్చేందుకు రాయితీలు ఇస్తోంది. కడప జిల్లా రాజకీయాలపై సీఎం చంద్రబాబు నాయుడుకు, మంత్రి నారా లోకేశ్‌కు అవగా హన ఉంది. అందుకే పరిశ్రమల స్థాపనలో వేలు పెడితే తాటతీస్తామన్న విధంగా నేతలను హెచ్చరించారు. దీంతో ఇప్పుడు పలు పరిశ్రమలు కడప వైపు చూస్తున్నాయి. జిల్లాకు మాత్రమే కాదు రాష్ట్రానికే మణి హారంగా ఉన్న కొప్పర్తి పారిశ్రా మికవాడలో ప్రత్యక్షంగా 2,400 మందికి ఉపాధి కల్పించే పరిశ్రమలు మంత్రి నారా లోకేశ్ చేతుల మీదుగా ప్రారంభానికి సిద్ధమ వుతున్నాయి.

2వ తేదీన నారా లోకేశ్ రాక


పరిశ్రమల ఏర్పాటుతో కొప్పర్తికి కళ సంతరించుకుంటోంది. సుమారు రూ.50కోట్ల వ్యయంతో టెక్నో ప్రైవేటు లిమిటెడ్ సంస్థ ద్వారా దుస్తుల తయారీ, సూటు, ఇతరత్రా తయారుకానున్నాయి. రూ.120 కోట్లతో టెక్నోడోమ్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్ పరిశ్రమ ప్రారంభించనున్నారు. దీంట్లో ఎల్ఈడీ టీవీలు, మల్టీమీడియా స్పీకర్లు ఇతర ఆడియోకు సంబంధించిన విభాగా లన్నీ ఇక్కడ తయారవుతాయి. 300 మందికి ఉపాధి కల్పిస్తుంది. వీటన్నింటినీ మంత్రి లోకేశ్ చేతుల మీదుగా సెప్టెంబర్ 2వ తేదీన ప్రారంభించనున్నారు. ఈ మేరకు ఏర్పాట్లు చేస్తున్నారు.

కొప్పర్తి హబ్

కడప నగర శివారులోని కొప్పర్తి పారిశ్రామిక వాడలో 600 ఎకరాల్లో మెగా ఇండస్ట్రియల్ హబ్‌ను ఏర్పాటు చేశారు. ఇక్కడ పలు పరిశ్రమలు ఏర్పాటు చేస్తున్నారు. జిల్లాలో అన్ని వసతులు ఉండటంతో కొప్పర్తి పారిశ్రామికవాడలో పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు ఔత్సాహికులు వస్తున్నారు. ఇప్పటికే పలువురు పారిశ్రామిక వేత్తలకు భూములు కేటాయించారు. కొందరు ఇక్కడ పరిశ్రమలు ఏర్పాటు చేస్తున్నారు.

ఆ పట్టాలకు పరిష్కారమెప్పుడో...?

- రైల్వేకోడూరు మండలంలో 17 వేల అతుకుబడి పట్టాలు
- జేసీ ఆధ్వర్యంలో ముమ్మరంగా కసరత్తు
- అయినా దొరకని మోక్షం
- సీసీఎల్ఏ నుంచి కదలని ఫైలు
- ఆగిపోయిన రిజిస్ట్రేషన్‌లు
- దిక్కుతోచని స్థితిలో బాధితులు



రైల్వేకోడూరు రూరల్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎక్కడా లేని సమస్య ఒక్క రైల్వేకోడూరులోని కొందరు రైతులకు ఎదురైంది. భూమి రికార్డుల్లో ఎక్కడా లేని విధంగా కొందరు రెవెన్యూ అధికారుల తప్పిదంతో అతుకుబడి అని చేర్చడంతో ఆ భూముల రిజిస్ట్రేషన్‌లు ఆగిపోయి బాధితులంతా దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. అతుకుబడి పట్టా అంటే భూమి లేని నిరుపేదలకు ప్రభుత్వం సాగు లేదా ఇంటి స్థలం కోసం కేటాయించిన భూమికి సంబంధించిన పట్టా. రైతులు పాస్‌పుస్తకాల్లో అతుకుబడి పట్టా ఉండడం చాలా అరుదు. ఒక రైల్వేకోడూరు మండలంలోనే సుమారు 17 వేల ఎకరాలకు సంబంధించిన రికార్డులు అతుకుబడి పట్టాగా నమోదు జరిగింది. ఎలా జరిగిందో తెలియదు గాని రైతు పాస్‌పుస్తకాలను ఆన్‌లైన్ చేసే క్రమంలో రైల్వేకోడూరు రెవెన్యూ శాఖలో పని చేస్తున్న ఓ కంప్యూటర్ ఆపరేటర్ 2012లో అతుకుబడి అనే పేరును ఎలా నమోదు చేశారో అంతు చిక్కని విషయంగా మారింది. గత టీడీపీ ప్రభుత్వంలో కానీ గత వైసీపీ ప్రభుత్వంలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా భూమి రిజిస్ట్రేషన్‌లు, భూమి రికార్డులో మార్పులు జరిగాయి. అయితే ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే భూముల సర్వేపై రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన కొత్త నిబంధలనతో ఈ అంశం తెరపైకి వచ్చింది. దీంతో రెవెన్యూ అధికారులు అతుకుబడిన భూములపై ప్రక్రియ ప్రారంభించారు. జయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ ఆదేశాల మేరకు గత తహసీల్దార్ మహబూబ్‌చాంద్ మండలంలోని అతుకుబడిన పట్టాల వివరాలను సేకరించి పూర్తి నివేదికను ఈ ఏడాది మార్చిలో కలెక్టర్ కార్యాలయానికి పంపించారు. జిల్లా కార్యాలయంలో అన్ని రికార్డులు పరిశీలించిన అధికారులు సీసీఎల్‌ఏకు నివేదికను పంపించారు. ఆరు నెలలు అవుతున్నా సీసీఎల్‌ఏలో ఇప్పటి వరకు ఎటువంటి పురోగతి లేదు. స్థానిక రైతులు ఎన్నిసార్లు ప్రభుత్వ కార్యాలయానికి వెళ్లినా ఒక వారంలో సమస్య పరిష్కారం అవుతుందని అధికారులు చెబుతున్నారని వాపోతున్నారు. అతుకుబడి ఉంటే భూమి ఆన్‌లైన్ కరెక్షన్స్ కూడా చేయలేని పరిస్థితి ఏర్పడింది. రైతు పట్టాదారు పాస్‌పుస్తకాల్లో జిరాయితీ అని ఉంటేనే రిజిస్ట్రేషన్ జరుగుతుంది. అతుకుబడి ఉంటే రిజిస్ట్రేషన్ జరగపోవడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో జరిగిన రెవెన్యూ సదస్సుల్లో అత్యధికంగా అతుకుబడి పట్టాలు ఉన్న రైతులు తమకు విముక్తి కల్గించాలని విన్నపాలు చేసుకున్నారు. అసలు జిరాయితీ అంటే ఎంటో అతుకుబడిన పట్టా అంటే ఏంటో తెలియక రైతుల అయోమయంలో ఉన్నారు. పిల్లల పెళ్లిళ్లు, ఉన్నత చదువుల కోసం భూములు అమ్మాలని భావించిన రైతులు తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా ఫలితం లేకపోవడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తెచ్చిన అప్పులు వడ్డీలతో పెరిగిపోతున్నాయని భూములు అమ్మి అప్పులు తీర్చాలని చూస్తున్నా అనుమతులు రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. ఇప్పటికైనా రెవెన్యూ మంత్రి, కలెక్టర్ తమ సమస్యను అర్థం చేసుకుని త్వరగా భూముల అమ్మకానికి అనుమతులు మంజూరు చేయాలని వేడుకుంటున్నారు.

అతుకుబడి పట్టాలకు అతి త్వరలోనే మోక్షం



అతుకుబడి పట్టాలకు అతి త్వరలోనే మోక్షం లభిస్తుంది. మండలంలో రైతుల సమగ్ర నివేదిక సిద్ధం చేసి జిల్లా అధికారులకు పంపించాము. జాయింట్ కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకుని పరిశీలిస్తున్నారు. జిల్లా అధికారులు దీనిపై ప్రత్యేకమైన శ్రద్ధ కనబరిచారు. రైతులకు క్రయవిక్రయాలు జరిగే విధంగా ప్రత్యేక చర్యలు తీసుకుంటాం. రైతులకు ఏ ఇబ్బంది లేకుండా చూస్తాం..

- కె.అమర్నాథ్, తహసీల్దార్, రైల్వేకోడూరు

ఇంకా ఎన్ని రోజులు వేచి చూడాలి.



నేను ఒక రైతు దగ్గర నుంచి ఇంకో రైతుకు పొలం అమ్మకం చేశాను. వారి నుంచి కొంత మొత్తాన్ని నగదు రూపంలో తీసుకున్నాను. రిజిస్ట్రేషన్ సమయంలో పుల్లంపేట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లగా ఆ భూమి విక్రయించలేరని వెళ్లి కోడూరు తహసీల్దార్‌ను సంప్రదించాలని సూచించారు. తహసీల్దార్‌ను సంప్రదించగా ఆ భూమి అతుకుబడిన పట్టా కిందకు వస్తుందని దీనిపై ఉన్నతాధికారులకు నివేదికలు పంపించామని త్వరలో పరిష్కారం అవుతుందని తెలిపారు. ఇప్పటికే 9 నెలలు గడుస్తున్నాయి. రైతులు నగదు చెల్లించాలని ఒత్తిడి చేస్తున్నారు. ఇంతకి భూమి రిజిస్ట్రేషన్ జరుగుతుందో లేదో అర్థం కావడం లేదు. జిల్లా స్థాయి అధికారులు స్పందించి న్యాయం చేయాలి.

- బాలాజీ, స్థానిక వ్యాపారస్తుడు

అంకాలమ్మ ఆలయానికి భూమి వితరణ



పత్రాలను గ్రామస్థులకు అందజేస్తున్న దృశ్యం

నిమ్మనపల్లి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): సామకోటవారిపల్లి పంచాయతీ నాయునివారిపల్లి వాసి ఆళ్లకుంట నారాయణ, క్రిష్ణమ్మ కుటుంబ సభ్యులు తరుణ్ వరలక్ష్మి గురువారం అంకాలమ్మ ఆలయ నిర్మాణానికి 10సెంట్ల భూమిని దానం చేశారు. వారు మాట్లాడుతూ నాయునివారిపల్లిలో అంకాలమ్మ గుడి ఏర్పాటు స్థలం లేకపోవడంతో తమ కుటుంబ సభ్యులు తమకు వున్న భూమిలోనే 10సెంట్ల భూమిని విరాళంగా ఇచ్చినట్లు తెలిపారు. అనంతరం గ్రామస్తులు మాట్లాడు తూ తమ గ్రామంలో దాదాపు 30కుటంబాలు వుండగా అంకాలమ్మ ఆలయ నిర్మాణం చేపట్టేందుకు భూమిని విరాళంగా ఇచ్చిన నారాయణ కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రెడ్డెప్ప, నాగరాజ, నరసింహులు, శేషాద్రినాయుడు, రవీంద్ర కృష్ణమ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

ములకలచెరువు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్రవాహనాలు ఢీకొనడంతో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు... దేవళచెరువు పంచాయతీ గోళ్లవారిపల్లెకు చెందిన శైలజ, మమత తమ అన్నతో పాటు ఓ ద్విచక్రవాహనంలో ములకలచెరువుకు వచ్చి తిరిగి స్వగ్రామానికి బయలుదేరారు. పెద్దపాళ్యం పంచాయతీ రామానాయుని కోటకు చెందిన చౌడప్ప మరో ద్విచక్రవాహనంలో ములకలచెరువుకు బయలుదేరాడు. ఈ క్రమంలో కొండకింద రైల్వేగేటు సమీపంలో వచ్చే సరికి రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో శైలజ, మమత, చౌడప్పకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో స్థానికులు చికిత్స నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

తాలూకా పోలీసులకు

సీసీ కెమెరాలు వితరణ



తాలూకా సీఐకు సీసీ కెమెరాలు అందిస్తున్న దృశ్యం

మదనపల్లె టౌన్, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): మదనపల్లె తాలూకా పోలీసులకు విస్టా ఫుడ్స్ సంస్థ సీఎస్ఆర్ ఫండ్స్ కింద రూ.2లక్షల విలువైన అత్యాధునిక సీసీ కెమెరాలను అందజేశారు. గురువారం స్థానిక లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు మార్పురి వరుణ్, లయన్స్ ఆస్పత్రి చైర్మన్ బి.భాస్కర్‌నాయుడు, ఆధ్వర్యంలో విస్టా ఫుడ్స్ సంస్థ కార్యక్రమం నిర్వహించారు. లయన్ గౌతమ్‌రెడ్డి మాట్లాడుతూ తాలూకా సీఐ కళా వెంకటరమణ, విస్టా ఫుడ్స్ మేనేజర్ వేణుగోపాల్‌రెడ్డితో సీసీ కెమెరాలు గురించి చర్చించారన్నారు. దీనిపై సంస్థ యజమాని దృష్టికి తీసుకెళ్లి సీఎస్ఆర్(కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీ) రూ.2లక్షలు మంజూరు చేయించారన్నారు. ఈ మొత్తంతో అత్యాధునిక సీసీ కెమెరాలను కొనుగోలు చేసి మదనపల్లె తాలూకా పోలీసులకు అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు ఎస్ఎస్ ప్రసాద్, భాస్కరాచారి, మార్పురి మహేష్, కామకోటి ప్రసాదరావు, డాక్టర్ నివేదిత, రైల్వే వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

రామాపురం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ యువకుడు మృతి చెందినట్లు ఎస్ఐ వెంకట సుధాకర్ రెడ్డి తెలిపారు. పోలీసుల కథనం మేరకు చిట్వేరు గ్రామం హరిజనవాడకు చెందిన ముదునూరు రమేశ్ (25), ద్విచక్ర వాహనంలో రాయచోటికి వెళుతుండగా ప్రేమాలయం సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. రామాపురం పోలీసులు మృతదేహాన్ని లక్కిరెడ్డిపల్లెలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అతనికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

పెండింగ్ పనులను పూర్తి చేయండి : కలెక్టర్

రాయచోటి (నేతాజీసర్కిల్), ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో చిన్న తరహా నీటి పారుదల ట్యాంకులను నింపే పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం అమరావతిలోని సచివాలయం నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ ప్రధానమంత్రి కుసుం పథకంతో పాటు చిన్న తరహా నీటి పారుదల ట్యాంక్‌ల నిర్వహణ, భూగర్భజలాలు పెంపుదల, వికలాంగ పెన్షన్లు, బాలల సంరక్షణ సంస్థల ఏర్పాట్లు తదితర అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. రాయచోటి కలెక్టరేట్ నుంచి కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, మదనపల్లె సబ్ కలెక్టర్ కళ్యాణి, డీఆర్‌వో మధుసూదన్‌రావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వ్యాపారులకు ప్రభుత్వం చేయూత



సమావేశంలో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి

రాయచోటి (నేతాజీ సర్కిల్), 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వ్యాపార సౌలభ్యానికి ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం చేయూతనందిస్తుందని మదనపల్లె సబ్‌కలెక్టర్ కళ్యాణి తెలిపారు. గురువారం రాయచోటిలోని కలెక్టరేట్ పీజీఆర్ఎస్ హాలులో మదనపల్లె సబ్ కలెక్టర్ అధ్యక్షతన బిజినెస్ రిఫార్మ్ యాక్షన్ ప్లాన్ అవుట్ రీచ్ కార్యక్రమాన్ని జిల్లా పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పెట్టుబడిదారులకు అనుకూల వాతావరణం కల్పించేందుకు కృషి చేస్తూ దేశవ్యాప్తంగా ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో అగ్రస్థానాన్ని సాధించిందని తెలిపారు. 2016 నుంచి 2020 వరకు వరుసగా మొదటి స్థానంలో నిలిచిందన్నారు. సులభతర వ్యాపారం చేయడంలో మన రాష్ట్రం ముందంజలో ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిశ్రల అధికారి కృష్ణకిషోర్ కేపీఎంజీ ప్రతినిధి రవితేజా, తదితరులు పాల్గొన్నారు.

ధర్మకర్తల మండలి దరఖాస్తుల పరిశీలన



దరఖాస్తులు స్వీకరిస్తున్న దేవదాయ శాఖ అధికారులు

తంబళ్లపల్లె ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ద పుణ్యక్షేత్రం మల్లయ్యకొండ భ్రమరాంబ మల్లికార్జునస్వామి ఆలయ దర్మకర్తల మండలికి 35 మంది దరఖాస్తులు చేసుకున్నారని దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ విశ్వనాథ్ తెలిపారు.

గురువారం అసిస్టెంట్ కమిషనర్ ఆలయ ఈఓ మునిరాజ్, రికార్డ్ అసిస్టెంట్ కొండ కిట్టాతో కలిసి మల్లయ్యకొండకు వెళ్లి మల్లికార్జున స్వామిని దర్శించుకున్నారు. అర్చకులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేసి స్వామి వారి తీర్థప్రసాదాలను అందించారు. అనంతరం పాలక మండలికి అందిన దరఖాస్తులను పరిశీలించారు. పోలీస్ క్లియరెన్స్ సర్టిఫికెట్లు, కులధ్రువీకరణ పత్రాలు, ఇతర సర్టిఫికెట్లు జతచేయని వారు సోమవారం లోగా దేవాదాయ శాఖ కార్యాలయంలో సమర్పించాలని సూచించారు. కార్యక్రమంలో కూటమి నేతలు గ్రామస్తులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

పోలీసులపై దాడికి యత్నం.. కేసు నమోదు

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు : సీఐ



మాట్లాడుతున్న సీఐ సత్యనారాయణ

నిమ్మనపల్లి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): పోలీసులపై దాడికి ప్రయ టత్నించిన తుపాకుల రోహిత్‌కుమార్‌పై కేసు నమోదు చేసినట్లు మదనపల్లి రూరల్ సీఐ సత్యనారాయణ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ కొండయ్యగారిపల్లి పంచాయతీ వెంకోజిగారిపల్లి, దాసరిపేట వాసి రోహిత్ వేదిక వద్ద డీజే పాటలు పెట్టి అసభ్యకరంగా డ్యాన్సులు వేయడంపై ఎస్ఐ తిప్పేస్వామి ప్రశ్నించడాన్ని రోహిత్ మాఇష్టం అంటూ పోలీసులపై తిరగబడి మీరు ఎవరు చెప్పడానికి అంటూ వారిపై నానా బూతులతో తిరగబడ్డాడు.

అంతేకాకుండా పోలీస్‌స్టేషన్‌లో పోలీసులను కొట్టేందుకు ప్రయత్నించాడని తెలిపారు. విషయం తెలుసుకున్న డీఎస్పీ మహేంద్ర హుటాహుటిన నిమ్మనపల్లి పోలీస్‌స్టేషన్‌కు వచ్చి కేసు పూర్తి వివరాలు తెలుసుకున్నారు. యూనిఫాంలో వున్న పోలీసులపై చెయ్యిఎత్తి నానా బూతులు తిట్టినందుకు రోహిత్‌కుమార్‌ను అరెస్ట్ చేసి కేసు నమోదు చేసి రిమాండుకు తరలించినట్లు సీఐ తెలిపారు.

భూతగాదాతో మహిళ ఆత్మహత్యాయత్నం



చికిత్స పొందుతున్న మంజుల

రామసముద్రం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): భూ తగాదా విషయమై కృష్ణప్ప కుమార్తె మంజుల ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. బలిజపల్లెలో గురువారం చోటుచేసుకున్న సంఘటనపై బాధిత మహిళ అందించిన వివరాల మేరకు మదనపల్లె మండలం కొత్తవారిపల్లె వాసి కృష్ణప్ప కుమార్తె మంజులకు రామసముద్రం మండలం బలిజపల్లెలో రెండెకరాలకు పైగా తండ్రి పేరుతో వ్యవసాయ భూమి ఉంది. ఆ భూమిని తన పెద్ద నాన్న గజ్జల వెంకటరమణ కబ్జా చేశాడని ఆరోపిస్తోంది. తన తండ్రి పేరుతో ఉన్న భాగం సర్వే చేసి తనకు ఇవ్వాలని ఏడాదిన్నరగా పలు మార్లు ప్రజా సమస్యల పరిష్కారం వేదిక, తహసీల్దార్లకు ఫిర్యాదు చేసినట్లు తెలిపింది.

గురువారం భూ సర్వే చేయడానికి రెవెన్యూ అధికారులు వివాదాస్పద భూమి వద్దకు చేరుకున్నారు. అయితే ఈ భూమిపై కోర్టులో కేసు నడుస్తోందని అందువల్ల భూమి సర్వే చేయడానికి వీలు లేదని మరో వర్గం వారు రెవెన్యూ అధికారులకు చెప్పడంతో చేసేది లేక రెవెన్యూ అధికారులు వెనుతిరిగారు. దీంతో తనకు ఇక న్యాయం జరగదని బావించిన బాధిత మహిళ అధికారుల సమక్షంలో విషం తాగి ఆత్మహత్యకు యత్నించగా కుటుంబీకులు ఆమెను వెంటనే మదనపల్లె జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

రాయచోటి అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యం

- రాయచోటి మున్సిపాలిటీని నెంబర్-1గా తీర్చిదిద్దుతాం
- మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి



జేసీబీ ఎక్కి పనులను ప్రారంభిస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటి, నేతాజీ సర్కిల్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): రాయచోటి నియోజకవర్గం అభివృద్ధి, సంక్షేమం సముపాళ్లలో చేపడుతున్నామని, రాయచోటి మునిసిపాలిటీని నెంబర్ వన్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యమని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. రాయచోటి పట్టణంలో రూ.3.50 కోట్లతో 36 అభివృద్ధి పనులను గురువారం ఆయన ప్రారంభించారు. మాండవ్య నది మరమ్మతు పనులను రూ.30 లక్షల వ్యయంతో చేపడుతున్నట్లు ఆయన తెలిపారు.

ఆ పనులను స్థానిక నాయకులతో కలిసి జేసీబీ ఎక్కి ప్రారంభించారు. పనుల విషయంలో నాణ్యత పాటించాలని తెలియజేశారు. అనంతరం మంత్రి క్యాంపు కార్యాలయంలో వివిధ సమస్యలతో వచ్చిన ప్రజల అర్జీలను స్వీకరించి పరిశీలించి తక్షణం సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యలను పరిష్కరించారు. ప్రజల సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించడమే కర్తవ్యమన్నారు. అందుకు అధికారులు సహకరించాలని తెలియజేశారు.

పేదలకు వరం సీఎం సహాయనిధి

అనారోగ్యంతో వైద్య సేవలు పొందిన నిరుపేదలకు సీఎం సహాయ నిధి వరం లాంటిదని మంత్రి తెలిపారు. తన క్యాంపు కార్యాలయంలో గురువారం 64 మంది లబ్ధిదారులకు రూ.71.24 లక్షల సహాయ నిధి చెక్కులు అందజేశారు. ఎన్టీఆర్ వైద్య సేవ కిందికి రాని అనారోగ్యాలకు సీఎం సహాయ నిధి ద్వారా ఆదుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు లక్ష్మీప్రసాద్‌రెడ్డి, మౌర్యా రెడ్డి, అర్చనా విద్యాసంస్థల అధినేత మదన మోహన్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ అనుంపల్లి రాంప్రసాద్ రెడ్డి, మురికినాటి సుబ్బారెడ్డి, గాజుల ఖాదర్‌బాషా, పలువురు నాయకులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని యువకుడు మృతి

మదనపల్లె అర్బన్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): లారీ ఢీకొని తెలంగాణకు చెందిన యువకుడు మృతి చెందినట్లు తాలుకా పోలీసులు తెలిపారు. గురువారం మదనపల్లె మండలం, కొత్తవారిపల్లె సమీపంలో జాతీయ రహదారిలో బైక్‌పై వెళుతున్న యువకుడిని లారీ ఢీకొన్నది.

గుర్తు తెలియని లారీ వెళ్లి పోయింది. ఈ ప్రమాదంలో తెలంగాణ రాష్ట్రం గద్వాల్ జిల్లాకు చెందిన జాన్ (40) అక్కడికి అక్కడే మృతి చెందాడు స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి పోస్టు మార్టం నిమిత్తం మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. తాలుకా సీఐ కళా వెంకటరమణ కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ప్రభుత్వ ధరకే యూరియా విక్రయించాలి




యూరియా బస్తాలను పరిశీలిస్తున్న అడిషనల్ ఎస్పీ

ఒంటిమిట, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం నిర్ణయించిన ధరకే ప్రైవేటు డీలర్లు యూరియాను విక్రయించాలని కడప, అన్నమయ్య జిల్లాల విజిలెన్స్ అడిషనల్ ఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. గురువారం ఒంటిమిట్టలోని ఎరువుల దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం నిర్ణయించిన ధరకే యూరియాను అమ్మాలని, అధిక ధరలకు విక్రయించేవారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. జిల్లాలో యూరియా కొరత లేదని తెలిపారు. రైతుల అవసరాలకు తగినంత యూరియాను అందజేస్తామన్నారు. కాంప్లెక్సు ఎరువులు కొంటేనే యూరియా, నానో యూరియా కొంటేనే యూరియా ఇస్తామని చెప్పే ప్రైవేటు డీలర్లపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. రైతు సేవా కేంద్రాలకు కూడా విడతల వారీగా యూరియా పంపిణీ చేస్తామన్నారు. యూరియా బస్తా 266.50 రూపాయలకు విక్రయించాలని, అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవన్నారు. ఎరువుల దుకాణానికి వచ్చిన రైతులతో మాట్లాడారు. డీలర్లు సక్రమంగా యూరియా ఇస్తున్నారా లేదా, భయపెడుతున్నారా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో సీఐ బాబు, ఏడీ ఏ సురేష్‌కుమార్‌రెడ్డి, విజిలెన్స్ అధికారి గీతావాణి, మండల వ్యవసాయాదికారి మంజులరాణి, వ్యవసాయాధికారి కృష్ణ, సుమంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ కోసం దివ్యాంగుడి పోరాటం

- సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌కు వినతి



యువగళంలో లోకేశ్‌తో సాయిశరత్ (ఫైల్)

మదనపల్లె, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): శారీరక సమస్యతో బాధ పడుతున్న ఓ అభాగ్యుడి వేదన ఇది. చిన్నప్పటి నుంచీ వికలత్వంపై పోరాటం చేస్తూ డిగ్రీ వరకు చదువుకున్నాడు. అటు ఉద్యోగం లేక, ఇటు ఉపాధి దొరక్క ఇంటికే పరిమితమయ్యాడు. 27 ఏళ్ల వయసున్న అతడు ఇప్పటికీ తల్లిదండ్రుల మీదనే ఆధారపడాల్సి వస్తోంది. కొంతలో కొంత ఊరటనిచ్చేలా వస్తున్న దివ్యాంగ పింఛన్‌ను గత వైసీపీ ప్రభుత్వం ఆపేసింది. దీంతో ఆయన పరిస్థితి దయనీయంగా మారంది. పింఛన్ పునరుద్ధరించాలని కోరుతున్నా ఎవరూ స్పందించడం లేదని వాపోతున్నాడు.

మదనపల్లె మండలం కొత్తయిండ్లు పంచాయతీ తాళ్లసుబ్బన్న కాలనీకి చెందిన రాటకొండ వెంకటరమణనాయుడు కుమారుడు సాయిశరత్ శారీరక సమస్యతో బాధపడుతున్నాడు. లేస్తే సరిగ్గా కూర్చోలేని పరిస్థితి, కూర్చుంటే ఇక లేవలేని పరిస్థితి సాయిశరత్‌ది. కాళ్లు చచ్చుబడిపోయి నిల్చోలేని, నడవలేని దయనీయ స్థితి. మెరుగైన చికిత్స కోసం తిరగని ఏరియా లేదు..చూపించని ఆసుపత్రీ లేదు. తిరుపతి, బెంగళూరు, చెన్నై, తదితర ప్రాంతాల్లో వైద్యంతోపాటు కాళ్లకు రెండుసార్లు శస్త్రచికిత్సలు చేయించినా ప్రయోజనం లేదు. ఈ పరిస్థితిలో 2011 నుంచి వస్తున్న దివ్యాంగ పింఛన్ 2022లో అప్పటి జగన్ ప్రభుత్వం రద్దు చేసింది. తండ్రి వెంకటరమణనాయుడు గుండెజబ్బు పేషంట్ కావడంతో తండ్రీ కొడుకులు ఇద్దరూ ఆసుపత్రికి వెళ్లడానికి చిన్నపాటి కారు ఉండేది. నాలుగు చక్రాల వాహనం పేరుతో పింఛన్‌ను రద్దు చేశారు. తర్వాత ఆ కారును ఆసుపత్రుల ఖర్చు నిమిత్తం అమ్మేశారు. కారు బాధితుడి పేరుతో లేదని, ఇతరుల పేరున రిజిస్ట్రేషన్ మారిపోయిందని స్థానిక మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ లెటర్ కూడా ఇచ్చారు.

కొత్తగా పింఛన్‌కు దరఖాస్తు చేసుకోవడానికి సచివాలయానికి వెళితే డీటీసీ లాగిన్‌లో పెండింగ్ ఉన్నట్లు చూపుతోంది. ఈ సమస్యను పరిష్కరించాలని, స్థానిక సచివాలయం నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేసినా సమస్య పరిష్కారం కాలేదు.

అంతకు ముందు కూడా బాధితుడు సాయి శరత్ అప్పటి టీడీపీ యువ నేత నారా లోకేశ్ యువగళం పాదయాత్రలో 2023లో మదనపల్లెకు వచ్చినప్పుడు పింఛన్ పునరుద్ధరించాలని వినతిపత్రం అందచేశారు. అలాగే గత ఏడాది నవంబరు 20న విజయవాడకు వెళ్లి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు కూడా వినతిపత్రం అందజేశారు. తర్వాత సీఎంవో కార్యాలయం నుంచి సమాచారం వచ్చినా..బాధితునికి ఇప్పటికీ పింఛన్ అందలేదు. 84 శాతం వికలత్వం ఉన్నట్లు సదరన్ క్యాంపులో వైద్యులు జారీ చేసిన సర్టిఫికెట్‌ను చేతపట్టుకుని సాయిశరత్..అటు అధికారులు, ఇటు రాజకీయ నాయకులను ఆశ్రయిస్తున్నా ఎటువంటి ప్రయోజనం లేదని వాపోతున్నాడు.

మెనూ అలా.. ధరలు ఇలా..

అమలు చేసేదెలా ?

- ఆకాశాన్నంటుతున్న నిత్యావసర ధరలు
- పెరగని మెస్ చార్జీలు
- పెండింగ్‌లో బిల్లులు
- తలలు పట్టుకుంటున్న సంక్షేమశాఖ అధికారులు


వేముల సాంఘిక సంక్షేమ వసతిగృహంలో భోజనం చేస్తున్న విద్యార్థులు (ఫైల్‌ఫొటో)

ప్రభుత్వం సంక్షేమ వసతిగృహాల విద్యార్థులకు అందించే మెనూ సూపర్బ్ అనిపించింది. ఇక తమ పిల్లలకు నాణ్యమైన భోజనం అందుతుందని తల్లిదండ్రులు సంబరపడ్డారు. కానీ నిత్యావసర ధరలు అమాంతం పెరిగిపోవడంతో నిబంధనల మేరకు మెనూ అమలు చేసేదెలా అని ఆ శాఖ అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ధరలకనుగుణంగా మెస్ చార్జీలు పెరగకపోవడంతో సమస్యలు ఎదురవుతున్నాయి. పైగా గత ప్రభుత్వం బిల్లులు పెండింగులో పెట్టడంతో అధికారులకు మరింత భారమైంది. అప్పులు చేసి మరీ పిల్లల కడుపు నింపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక కొంత మేర బిల్లులు చెల్లించినా ఇంకా పెండింగ్‌లో ఉన్నాయని అధికారులు వాపోతున్నారు.

కడప ఎన్టీఆర్‌సర్కిల్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రస్తుతం బీసీ, ఎస్సీ, ఎస్టీ వసతిగృహాలన్నీ కలిపి వంద వరకు ఉన్నాయి. సాంఘిక సంక్షేమ శాఖ పరిధిలోని 67 వసతిగృహాల్లో 6756 మంది విద్యార్థులున్నట్లు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. గిరిజన సంక్షేమ వసతిగృహాల్లో 430 మంది, బీసీ సంక్షేమ వసతిగృహాల్లో 4వేల మందికి పైగా వసతి పొందుతున్నారు. గత ప్రభుత్వం ఏడెనిమిది నెలలుగా బిల్లులు పెండింగులో పెట్టేయడంతో విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనాలు వడ్డించేందుకు వసతిగృహాల సంక్షేమ అధికారులు నానా అవస్థలు పడ్డారు. నెలల తరబడి బిల్లులు పెండింగులో ఉండడంతో కొంత వరకు దుకాణదారులు కూడా సరుకులు ఇచ్చేందుకు వెనుకాడే పరిస్థితి కనిపించింది. ఈ క్రమంలో కొంతమంది సంక్షేమ అధికారులు అప్పులు చేసి వసతిగృహాల్లోనే పిల్లల కడుపు నింపే పరిస్థితి ఏర్పడింది. కూటమి ప్రభుత్వం వచ్చాక ఏప్రిల్ నెల వరకు బిల్లులు ఇచ్చారు. ప్రస్తుతం మూడు నెలలకు సంబంధించిన బిల్లులను అందించేందుకు రికార్డులు సిద్ధం చేసినట్లు అధికారులు చెబుతున్నారు.

ధరల్లో వ్యత్యాసం

నిత్యావసర ధరలు ఎప్పటికప్పుడు ఇబ్బడి ముబ్బడిగా పెరుగుతుండడంతో మెనూ అమలు ప్రశ్నార్థకంగా మారింది. ప్రస్తుతం ఇస్తున్న డైట్ చార్జీలతో నిర్దేశిత మెనూ ఉంటుందని వార్డెన్లు వాపోతున్నారు. రోజూ ఉదయం పాలు, అల్పాహారం, వేరుశెనగ చిక్కీలు, వారంలో ఆరు సార్లు కోడిగుడ్లు, మూడురోజులు కోడిమాంసం, రోజూ రాత్రి పూట భోజనం తరువాత అరటిపండు ఇవ్వాల్సి ఉంది. ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనాల్లో కూర, పెరుగు తప్పనిసరి. ఆదివారం కాకుండా మిగతా సెలవు రోజుల్లో మధ్యాహ్న భోజనంలో సాంబారు, గుడ్డుకూర ఉండాలి. ఈ క్రమంలో ప్రభుత్వం విద్యార్థులకిస్తున్న డైట్ చార్జీలు పరిశీలిస్తే 3-5వ తరగతి వరకు విద్యార్థులకు మెస్ చార్జీల కింద ఒక్కొక్కరికి నెలకు రూ.1150 చొప్పున, 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు రూ.1400 చొప్పున, ఇంటర్, ఆపై చదివే విద్యార్థులకు రూ.1600 లెక్కన ప్రభుత్వం ఇస్తుంది. 2023లో సవరించిన డైట్‌చార్జీల ప్రకారం గమనించినట్లయితే కోడిగుడ్డుకు రూ.3 చొప్పున ప్రభుత్వం ఇస్తుంది. బయట మార్కెట్‌లో వాటి ధర రూ.6.50 పైసలుగా ఉంది. అదే విధంగా కిలో చికెన్‌కు రూ.90, కందిపప్పు, పామాయిల్‌పై మరో రూ.40 అదనంగా పడుతుంది. ఇక కూరగాయల ధరలు చెప్పలేని పరిస్థితి. నిత్యావసర ధరలు అన్నీ పెరిగిపోయాయి. ప్రస్తుత ధరలకనుగుణంగా మెస్‌చార్జీలు పెంచాలని అటు వసతిగృహాల సంక్షేమ అధికారులు ఇటు విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

ఇదే అదనుగా

మెస్‌చార్జీలు నిత్యావసర ధరలకనుగుణంగా లేవనే కారణంతో కొన్ని వసతిగృహాల్లో సంక్షేమ అధికారులు కొంత మంది చేతివాటం ప్రదర్శిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. విద్యార్థుల హాజరుకనుగుణంగా వంటలు చేయాల్సి ఉంటుంది. కానీ కొన్ని వసతి గృహాల్లో విద్యార్థుల హాజరు కంటే తక్కువ మంది భోజనం చేస్తున్నట్లు సమాచారం. ఈ క్రమంలో అటు సంక్షేమ అధికారులు కానీ, వసతిగృహాల్లో పనిచేసే సిబ్బంది నిత్యావసర వస్తువులను ఇళ్లకు తరలించే పని పెట్టుకున్నట్లు ఆరోపణలు లేకపోలేదు. ఏదేమైనా ప్రభుత్వం కూడా వాస్తవిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని క్షేత్రస్థాయిలో పేద విద్యార్థులకు కడుపు నిండా భోజనం పెట్టేందుకు ఎప్పటికప్పుడు డైట్ చార్జీలు సవరించాల్సిన అవసరం ఉంది.

ఈ విషయమై సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టరు సరస్వతిని ఆంధ్రజ్యోతి వివరణ కోరగా, వసతిగృహాల్లో విద్యార్థుల హాజరు పక్కాగానే ఉంటుందని, ఎక్కడా అక్రమాలకు తావు లేకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తూ విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

13న జాతీయ లోక్ అదాలత్

● జిల్లా ప్రధాన జడ్జి యామిని

కడప రూరల్, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): జాతీయ, రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థల ఆదేశాల మేరకు జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో సెప్టెంబరు 13న ఉమ్మడి కడప జిల్లా వ్యాప్తంగా జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు డీఎల్ఎస్ఏ ఛైర్‌పర్సన్, జిల్లా ప్రధాన న్యాయాధికారి డాక్టర్ సి.యామిని తెలిపారు. జాతీయ లోక్ అదాలత్‌ను సంబంధిత శాఖల అధికారులు, న్యాయవాదులు, కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. జాతీయ లోక్‌అదాలత్‌లో ఒకసారి కేసు పరిష్కారమైతే సుప్రీంకోర్టు తీర్పుతో సమానమన్నారు. తిరిగి అప్పీల్ చేసుకోవడానికి వీలుపడదన్నారు. పైగా సమయం, డబ్బు ఆదా అవుతాయన్నారు. కక్షిదారుల మధ్య వ్యక్తిగత సంబంధాలు దెబ్బతినవన్నారు. ఇలాంటి ప్రయోజనాలు కలిగిన జాతీయ లోక్ అదాలత్‌ను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కారు ఢీకొని వృద్ధురాలు మృతి



జమ్మలమడుగు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు మండలం మోరగుడి రచ్చబండ వద్ద బుధవారం రాత్రి కారు ఢీకొని పల్లా రాజేశ్వరి (65) అనే వృద్ధురాలు మృతిచెందారు. మోరగుడి రచ్చబండ సమీపాన కొలువైన వినాయక విగ్రహం వద్ద పూజలు చేసి తిరిగి ఇంటికి వస్తుండగా జమ్మలమడుగు వైపు నుంచి మైలవరం వెళ్లే ఓ కారు ఢీకొంది. ఈ ఘటనలో ఆమెకు తీవ్రగాయాలు కాగా దగ్గరే ఉన్న ఆర్ఎంపీ వద్దకు తీసుకెళ్లి చికిత్స చేయించామని కుటుంబసభ్యులు తెలిపారు. పరిస్థితి విషమంగా ఉండటంతో పల్లా రాజేశ్వరిని జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. ఆమెను ఢీకొన్న కారు ఆగకుండా వెళ్లిపోవడంతో మైలవరంలో వారిని అదుపులోకి తీసుకుని గురువారం ఉదయం జమ్మలమడుగు అర్బన్ పోలీసు స్టేషన్‌కు తెచ్చినట్లు పోలీసులు తెలిపారు.

కరెంటు షాక్‌తో యువకుడి మృతి



కడప క్రైం, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): కడప నగరం బాలాజీనగర్‌లో వినాయక మండపం వద్ద ఓ యువకుడు సెల్‌ఫోను చార్జింగ్ పెట్టే సమయంలో కరెంటు షాక్ తగిలి మృతిచెందాడని తాలూకా ఎస్ఐ తులసీనాగప్రసాద్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు.. కడపనగరం రాజారెడ్డివీధికి చెందిన సుమన్‌తేజ (20) క్యాటరింగ్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. బుధవారం సాయంత్రం వర్షం పడుతున్న సమయంలో సుమన్ తేజ తడుచుకుంటూ వచ్చి సెల్‌ఫోను చార్జింగ్ పెట్టేందుకు వినాయక మండపంలోని విద్యుత్ వైరును లాగాడు. దీంతో షాక్‌కు గురై అక్కడికక్కడే కుప్పకూలి ప్రాణాలు వదిలాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు



సీకేదిన్నె, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): కడప-రాయచోటి జాతీయ రహదారిలో మూలవంక వద్ద గురువారం బైకు అదుపు తప్పి ఓ వ్యక్తి గాయపడ్డాడు. ఆజాద్‌నగర్‌కు చెందిన శ్రీనివాసులు ద్విచక్ర వాహనంలో వెళుతుండగా మూలవంక వద్ద అదుపు తప్పి డివైడర్‌కు ఢీకొనడంతో కిందపడ్డాడు. దీంతో గాయపడిన శ్రీనివాసులును స్థానికులు 108 వాహనంలో రిమ్స్‌కు తరలించారు.

నృత్య, సంగీత కోర్సులల్లో ప్రవేశాలు

కడప ఎడ్యుకేషన్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): యోగి వేమన విశ్వవిద్యాలయంలోని లలిత కళల శాఖ ఆధ్వర్యంలో కూచిపూడి, కర్ణాటక సంగీతం, కీబోర్డు సర్టిఫికెట్ కోర్సులలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ డాక్టర్ టి.లక్ష్మీప్రసాద్ తెలిపారు. ప్రవేశాల ప్రక్రియ ఈనెల 28వ తేదీ నుంచి సెప్టెంబరు 12వ తేదీ వరకు కొనసాగుతుందన్నారు. పదేళ్ల వయసు నిండినవారి నుంచి తర్వాత ఏ వయసు వారైన ఈ కోర్సుల్లో చేరవచ్చని, మరిన్ని వివరాలకు 9032595101నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

యువత పారిశ్రామికంగా ముందడుగు వేయాలి

కడప మారుతీనగర్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందించే రుణాలను సద్వినియోగం చేసుకుని యువత పారిశ్రామికంగా ముందడుగు వేయాలని పరిశ్రమల కేంద్రం జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఫ్లాగ్‌షిప్ పథకాలపై గురువారం స్థానిక బాలాజీనగర్‌లో ఉన్న నెహ్రూ యువకేంద్ర కార్యాలయంలో వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సహకారంతో చిన్నస్థాయి నుంచి భారీ స్థాయి పరిశ్రమలు ఏర్పాటుచేసే దిశగా నిరుద్యోగ యువత అడుగులు వేయాలన్నారు. పీఎంఈజీపీ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం గ్రామీణ నిరుద్యోగులకు 35 శాతం వరకూ సబ్సిడీ రుణాలు అందిస్తోందన్నారు. కార్యక్రమంలో మై భారత్ జిల్లా యువజన అధికారి ప్రదీప్‌కుమార్, మైభారత్ యూత్ కార్యాలయ అకౌంట్, ప్రోగ్రామ్ సూపర్‌వైజర్ బాబురెడ్డి పాల్గొన్నారు.

పీవోపీ విగ్రహాలు పర్యావరణానికి హానికరం


అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

సింహాద్రిపురం, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): పీవోపీ (ప్లాస్టర్ ఆఫ్ పారిస్) విగ్రహాలు పర్యావరణానికి హానికరమని సింహాద్రిపురం జడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తెలిపారు. గురువారం ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి సింహాద్రిపురంలో 26 చోట్ల ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలను దర్శించి, గ్రామ ఉత్సవ కమిటీ సభ్యులతో మాట్లాడారు. పీవోపీ విగ్రహాలను చెరువులు, కుంటలలో నిమజ్జనం చేయడం వలన నీరు కలుషితమవుతుందని, ఇది చేపలు, ఇతర జల జీవులకు ప్రమాదకరమని తెలిపారు. అలాగే గ్రీన్‌హౌస్ గ్యాసెస్ పెరగడం, గ్లోబల్ వార్మింగ్, యాసిడ్ రైన్స్, అకాల వర్షాలు సంభవించే ప్రమాదముందన్నారు. ఇకపై మట్టి విగ్రహాలు, ఎకో-ఫ్రెండ్లీ విగ్రహాలు వాడినట్లయితే పర్యావరణంతో పాటు మన సంప్రదాయాలను కూడా కాపాడినట్లవుతుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సూర్యశ్చంద్రారెడ్డి, పద్మనాభరెడ్డి, జయప్రకాష్‌రెడ్డి, బాలకృష్ణారెడ్డి, విద్యార్థులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కడప ఇన్‌చార్జి డీటీసీగా అనంతపురం డీటీసీ

కలికిరి/కడప, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం ఖాళీగా వున్న కడప డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనరు పోస్టుకు ఇన్‌చార్జిగా అనంతపురం డీటీసీగా పనిచేస్తున్న ఎం.వీర్రాజును నియమిస్తూ ప్రభుత్వం గురువారం ఆదేశాలు జారీ చేసింది. తదుపరి ఉత్తర్వులిచ్చేంత వరకూ పరిపాలనాపరమైన కారణాలతో వీర్రాజును పూర్తి అదనపు బాధ్యతలతో కడప డీటీసీగా కొనసాగిస్తూ రవాణా, రహదార్ల శాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే ఉత్తర్వులు జారీ చేశారు.

స్టెప్ సీఈవో డెప్యుటేషన్ రద్దు

కలికిరి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లా యువజన సర్వీసులకు సంబంధించిన 'స్టెప్' (సొసైటీ ఫర్ ట్రైనింగ్ అండ్ ఎంప్లాయ్‌మెంట్ ప్రమోషన్) సీఈవోగా పనిచేస్తున్న సి.సాయిగ్రేస్ డెప్యుటేషన్‌ను రద్దు చేస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం సాయిగ్రేస్ ప్రజారోగ్యం, కుటుంబ సంక్షేమ శాఖ నుంచి డెప్యుటేషన్‌పై 'స్టెప్' సీఈవోగా పనిచేస్తున్నారు. సాయిగ్రేస్‌ను మాతృ సంస్థకు తిప్పి పంపేందుకు తగిన చర్యలు తీసుకోవలసిందిగా యువజన సర్వీసుల శాఖ కమిషనరు, స్టెప్ డైరెక్టరును ఆదేశిస్తూ రాష్ట్ర యువజన సర్వీసులు, క్రీడలు, పర్యాటక, సాంస్కృతిక శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి అజయ్ జైన్ గురువారం ఆదేశాలు జారీ చేశారు.

ఆర్టీసీలో పర్మినెంట్ ఉద్యోగాలు కల్పించాలి

మంత్రికి ఏపీ టీఏటీయూ వినతి

ప్రొద్దుటూరు అర్బన్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలో పర్మినెంట్ ఉద్యోగాలు కల్పించాలని ఆంధ్రప్రదేశ్ టెక్నికల్ అప్రెంటిషిప్ ట్రేడ్ యూనియన్ జోనల్ సెక్రటరి రాజనాల రాజేశ్ కోరారు. ఆమేరకు ఏపీ టీఏటీయూ సభ్యులతో పాటు గురువారం రోడ్డు రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని కడప విమానాశ్రయంలో కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐటీఐ విద్యార్హతతో ఏపీఎస్ఆర్టీసీలో 1961 యాక్టు అప్రెంటీస్ శిక్షణ పూర్తి చేసుకున్న వారిలో పలువురికి ప్రస్తుతం ఉద్యోగం, ఉపాధి లేక జీవనం భారంగా మారిందన్నారు. 2011 నుంచి 2025 వరకు ఏపీఎస్ఆర్టీసీ గ్యారేజీలో ఉద్యోగాలు భర్తీ చేయలేదన్నారు. ఏపీ టీఏటీయూ సభ్యులకు వయోపరిమితి పెరిగిపోతోందని, ఇప్పటి వరకు పర్మినెంట్ ఉద్యోగాలు లేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. రాష్ట్రమంతటా ఏపీఎస్ఆర్టీసీలో అప్రెంటీస్‌గా చేసి ఎంతో మంది ఉద్యోగాలు రాక నిరుద్యోగులుగా మిగిలారని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకుపోయి తమకు ఆర్టీసీలో పర్మినెంట్ ఉద్యోగ అవకాశం కల్పించాలని కోరారు.

క్వాంటమ్ కంప్యూటింగ్‌పై సదస్సు

వేంపల్లె, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): అమరావతిలో క్వాంటమ్ కంప్యూటింగ్ ఐబీఎమ్ ద్వారా టెక్నాలజీని ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో గురువారం ఇంటర్నల్ క్వాంటమ్ కంప్యూటింగ్‌పై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ కుమారస్వామి గుప్తతో పాటు ట్రిపుల్‌ఐటీ పరిపాలన విభాగం అధికారులు, హెచ్‌ఓడీలు మాట్లాడుతూ.. సమాజానికి అవసరమైన సమస్యలతో పాటు కంప్యూటింగ్ క్వాంటమ్ కమ్యూనికేషన్, భద్రత, మెడికల్, బ్యాంకింగ్ రంగం, వ్యవసాయ రంగాలకు అమలు చేసేందుకు భవిష్యత్తు ప్రణాళికలు జరుగుతున్నాయని తెలిపారు. క్వాంటమ్ కంప్యూటింగ్‌పై నైపుణ్యతను పరీక్షించే పోటీలు ఉన్నాయని, రీజనల్ స్థాయిలో ఎంపికైన వారికి రాష్ట్రస్థాయి పోటీలు అమరావతి క్వాంటమ్ వ్యాలీలో సెప్టెంబర్‌లో జరుగుతాయన్నారు. సుమారు వందమంది విద్యార్థులు 25 విభాగాల్లో టెక్నాలజీకి సంబంధించి నైపుణ్యాలను ప్రదర్శించారన్నారు.

ఇందులో అత్యుత్తమ ప్రతిభ చూపిన వారిని తదుపరి లెవెల్ పోటీలకు వెళ్తారని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పరిపాలన అధికారి పెనుగొండ రవికుమార్, రత్నకుమారి, కొండారెడ్డి, అరుణ్, రమేష్‌సుధాకర్‌రెడ్డి, కార్తీక్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అధిక రేట్లకు అమ్మితే లైసెన్సు రద్దు చేస్తాం

కమలాపురం రూరల్, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): ఎరువుల దుకాణాల యాజమాన్యాలు రైతులకు అధిక రేటుకు అమ్మితే వారి లైసెన్సులు రద్దు చేస్తామని జిల్లా వ్యవసాయ అధికారి చంద్రనాయక్ తెలిపారు. గురువారం ఆయన సహాయ వ్యవసాయ సంచాలకులు ఏపీ నరసింహారెడ్డితో కలిసి పట్టణంలోని ఎరువుల దుకాణాలను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ఖరీఫ్ సీజన్‌కు మండలంలో 291 మెట్రిక్ టన్నుల యూరియా పంపిణీ చేయడం జరిగిందని, ఇప్పటి వరకు ఎటువంటి కొరత రాలేదని తెలిపారు. కార్యక్రమంలో విజిలెన్స్ ఏసీ సుధాకర్, సీఐ రోషన్, మండల వ్యవసాయాధికారి సరస్వతి పాల్గొన్నారు.

కోర్టు డిక్రీ కేసులో రూ.26.50 లక్షలు మంజూరు

కలికిరి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): జలవనరుల శాఖకు చెందిన చిన్న నీటిపారుదల శాఖకు సంబంధించి కడప జిల్లా సీనియర్ సివిల్ జడ్జి కోర్టు మంజూరు చేసిన డిక్రీ వ్యవహారంలో రూ.26.50 లక్షలు మంజూరు చేస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం అన్నమయ్య జిల్లా వీరబల్లి మండలంలో మాండవ్య నదిపై జరిగిన ఆనకట్ట నిర్మాణం, కాలువల తవ్వకం పనులకు సంబంధించి కడప సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో 2005లో కేసు నమోదయింది. దీనిపై 2007లో మరో ఎగ్జిక్యూషన్ పిటిషన్‌లో వెలువడిన ఉత్తర్వుల మేరకు ఈ వివాదాన్ని ముగించడానికి రూ.26.50 లక్షలు మంజూరు చేస్తున్నట్లు ప్రభుత్వం పేర్కొంది. మళ్లీ ఈ వివాదం కొనసాగకుండా మరోమారు అన్ని లెక్కలు సరిచూసి పూర్తి చెల్లింపులు చేయాలని కూడా చీఫ్ ఇంజినీరుకు ప్రభుత్వం సూచించింది. ఆర్థిక శాఖ ముందస్తు ఆమోదం నిధులు మంజూరు చేస్తున్నట్లు పేర్కొంటూ జలవనరుల శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జి.సాయిప్రసాద్ గురువారం ఆదేశాలు జారీ చేశారు.

మైనంపాటికి ఘన నివాళి

కడప కల్చరల్, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): మైనంపాటి వెంకటసుబ్రహ్మణ్యం మేటి చిత్రకారుడని వైవీయూ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య టి.శ్రీనివాస్ కొనియాడారు. గురువారం సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో మైనంపాటి వెంకట సుబ్బహ్మణ్యం జయంతిని నిర్వహించారు. ముందుగా మైనంపాటి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లలితకళల్లో ప్రావీణ్యం కలిగిన మైనంపాటి కుంచెపట్టి భారతి పత్రికలో లభించిన బ్రౌన్ తండ్రి డేవిడ్ బ్రౌన్ ఛాయాచిత్రం ఆధారంగా సంవత్సరం పాటు శ్రమించి సీపీ బ్రౌన్ ఊహా చిత్రాన్ని చిత్రించారన్నారు. కార్యక్రమంలో బి.గోపాలకృష్ణశాస్త్రి, చింతకుంట శివారెడ్డి, హరిభూషణరావు, రమేష్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పలు కుటుంబాలు టీడీపీలో చేరిక


కండువా వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న బీటెక్ రవి

పులివెందుల, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): పులివెందుల పట్టణంలో పలు కుటుంబాలు నియోజకవర్గ ఇన్‌చార్జి బీటెక్ రవి ఆధ్వర్యంలో టీడీపీలో చేరాయి. శ్రీరామ థియేటర్, రాఘవేంద్ర థియేటర్ ప్రాంతానికి చెందిన కొంగనపల్లె శ్రీనివాసులు, కృష్ణవేణి, ఫిజియోథెరపీ డాక్టర్ వెంకటసాయికిశోర్, శ్రీనివాసులరెడ్డి, తులశమ్మ, మహమ్మద్‌రఫి, నూర్‌బాష, బీబీలతో పాటు 20 కుటుంబాలు, వెంకటేశ్వరరెడ్డితో సహా మరో 40 కుటుంబాలు టీడీపీలో చేరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పార్థసారథిరెడ్డి, తూగుట్ల సిద్ధారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, వెంకటరామిరెడ్డి, హజ్ కమిటీ డైరెక్టర్ మహబూబ్ బాష పాల్గొన్నారు.

ఎంపీహెచ్‌డబ్ల్యూ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

కడప కలెక్టరేట్, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి) మల్టీపర్పస్ హెల్త్ వర్కర్స్ (ఫిమేల్) రెండేళ్ల కోర్సులో ప్రవేశం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ నాగరాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలోని ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు కళాశాలల్లో శిక్షణ ఇస్తామనని పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, దరఖాస్తుల పరిశీలన అనంతరం అక్టోబరు 15న ఎంపికైన జాబితాను ప్రచురిస్తామని వివరించారు. వివరాలకు డీఎంఅండ్‌హెచ్‌వో కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడీవిటి

ఎర్ర దుంగలు స్వాధీనం.. నలుగురు అరెస్ట్


వివరాలు తెలుపుతున్న డీఎస్పీ రాజేంద్రప్రసాద్, స్వాధీనం చేసుకున్న దుంగలు

మైదుకూరు రూరల్, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): దువ్వూరు మండలంలో 42 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని నలుగురిని అరెస్ట్ చేసినట్లు మైదుకూరు డీఎస్పీ రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. బుధవారం స్థానిక డీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దువ్వూరు మండలంలోని నీలాపురం గ్రామం సమీపంలోని చెరువు వద్ద అక్రమరవాణాకు సిద్ధంగా ఉంచిన 42 ఎర్రచందనం దుంగలను ముందస్తు సమాచారం మేరకు పోలీసులు గుర్తించగా, స్మగ్లర్లు పోలీసులపై రాళ్లదాడి చేశారన్నారు. అయితే పోలీసులు చాకచక్యంగా వారిని వెంబడించి పట్టుకొన్నారన్నారు. పోలీసులు అదుపులోకి తీసుకున్న వారిలో ప్రస్తుతం హైదరాబాద్‌లో నివాసం ఉంటున్న తమిళనాడుకు చెందిన రాజేంద్ర కుమారన్, దువ్వూరు మండలం దాసరిపల్లెకు చెందిన ముత్తూరు బసప్ప, సీకే దిన్నెకు చెందిన సయ్యద్ దర్బార్ బాష, కడప టౌన్ రవీంద్రనగర్‌కు చెందిన సయ్యద్ అబ్దుల్లా ఉన్నారన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరిచినట్లు డీఎస్పీ తెలిపారు. స్మగ్లర్లను పట్టుకోవడంలో కృషి చేసిన సీఐ శివశంకర్, ఎస్ఐ వినోద్‌కుమార్‌లను డీఎస్పీ అభినందించారు.


రాయచోటి: సరస్వతి నగర్‌లోని వినాయకుడి మండపంలో పూజలు చేస్తున్న సుగవాసి ప్రసాద్ బాబు


నందలూరులో ఉట్టి కొడుతున్న యువకులు


రాజంపేట పట్టణం ఎర్రబెల్లి వినాయక ఉత్సవాల్లో మన్నూరు సీఐ ప్రసాద్ బాబు

భక్తి శ్రద్ధలతో గణనాథుడి ఉత్సవాలు

రాయచోటి, రాజంపేట, రైల్వే కోడూరు నియోజకవర్గాల్లోని అన్ని పట్టణాలు, పల్లెల్లో బుధవారం వినాయకచవితి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వినూత్న రీతిలో ఉత్సవ మండపాలు ఏర్పాటు చేయడంతోపాటు పలు మండపాల వద్ద అన్నదానం చేశారు. భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

రైల్వేకోడూరు, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): రైల్వేకోడూరు పట్టణంలో వినాయకమండపాన్ని గుహలాగా అలంకరించారు.

చిట్వేలి: మండలంలో 123 ప్రాంతాల్లో వినాయకుని మండపాలను ఏర్పాటు చేశారు. ఈనెల 29న 55, 30న 6, 31న 58, సెప్టెంబరు 1న 1, 3 5, 6 తేదీల్లో 1 చొప్పున విగ్రహాలను నిమజ్జనం చేస్తున్నట్లు పోలీసులు తెలియజేశారు.

గాలివీడు : గాలివీడు బస్టాండ్, మూడు రోడ్ల కూడలి, హైస్కూల్ వద్ద పెద్ద విగ్రహాలు ఏర్పాటు చేశారు. రెండు రోజుల పాటు గణనాదునికి ఘనంగా పూజలు నిర్వహించారు.

లక్కిరెడ్డిపల్లె: మండలంలో 200 పైగా మండపాలు ఏర్పాటు చేశారు. ప్రతి మండపంలో అన్నదానం, రాత్రి వేళల్లో హరికథలు, చెక్కభజనలు, నిర్వహించారు. టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి యనమల మదన్ మోహన్, ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్‌రెడ్డి పూజలు నిర్వహించారు.

సుండుపల్లి: రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి మేనల్లుడు మౌర్యారెడ్డి మండలంలోని కుప్పగుట్ట, కుంటలముందర, కుప్పగుట్ట హరిజనవాడలకు వినాయకుని విగ్రహాలను అందించారు. గురువారం రవి, బత్తల సాంబశివ సహకారంతో కార్తికేయ నగర్, శివాజీ నగర్‌లో అన్నదానం చేశారు. జనసేన నాయకులు ఒంటేరు రాజా, జయరాం ఉత్సవ కమీటి సభ్యులు పాల్గొన్నారు.

ఒంటిమిట్ట : గురువారం సాయంత్రం ఉట్టి కొట్టడం, ముగ్గుల పోటీలు నిర్వహించారు. మండలంలో 95 వినాయక విగ్రహాలను ఏర్పాటు చేశారని సీఐ బాబు తెలిపారు

సిద్దవటం : సిద్దవటం మండలంలోని నేకనాపురం గ్రామం ఎస్సీ కాలనీకి రాష్ట్ర పంచాయతీరాజ్ ఆర్గనైజింగ్ సెక్రటరి కుప్పాల వెంకటసుబ్బయ్య వినాయకుని విగ్రహం, అన్న ప్రసాదాలకు సహకరించారు. సిద్దవటం, ఒంటిమిట్ట, చిన్నచౌకు, బద్వేల్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన విగ్రహాలను సిద్దవటం హైలెవల్ వంతెన వద్ద నిమజ్జనం చేసేందుకు పోలీసు అధికారులు తగు ఏర్పాట్లు చేశారు. బాకరాపేట గ్రామంలోని దిగువ, ఎగువ, కొత్త ఎస్సీ కాలనీల్లో వినాయకచవితి ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలను రాజంపేట జనసేనపార్టీ పార్లమెంట్ సమన్వయకర్త అతికారి కృష్ణ గురువారం దర్శించుకున్నారు. టీడీపీ నేతలు చెంచయ్యనాయుడు, పుత్త రామచంద్రయ్య రామ్మోహన్ నాయుడు, కూటమి నేతలు శ్రీకాంత్, రవికుమార్, శివానంద, ఉపాదిహామీ ఫీల్డ్ అసిస్టెంట్ పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

పెనగలూరు: సింగారెడ్డిపలెట్లలో మాజీ ఎంఈవో శ్రీరామదాసు, సుబ్బరాయుడు, ఉషాకుమారి ఆధ్వర్యంలో, కొత్తపల్లిలో దువ్వూరు వేణుగోపాల్‌రెడ్డి కుటుంబ సభ్యులు, ఇండ్లూరులో బెల్లం వెంగయ్య కుటుంబ సభ్యుల అన్నదానం చేశారు.

నందలూరు : మండలంలోని నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయథబూా ఆర్ఎస్ రోడ్డులోని ఎన్టీఆర్ నగర్‌వద్ద ఏర్పాటు చేసిన వినాయకస్వామి విగ్రహం వద్ద గురువారం సాయంత్రం ఉట్టికొట్టే కార్యక్రమం నిర్వహించారు. ఈ పోటీలో రేగిమడుగు సోమశేఖర్ విజేతగా నిలిచి 20 గ్రాముల వెండి కైవసం చేసుకున్నాడు. నాగిరెడ్డిపల్లె గ్రామంలో రెడ్డి కమ్యూనిటీ డెవలప్ మెంట్ సొసైటీ జిల్లా ప్రచార కార్యదర్శి గుండు మల్లికార్జునరెడ్డి మట్టి గణపతులు, అరటిపిలకలు, దర్భ ఉచితంగా పంచిపెట్టారు. ఆకేపాటి జగదీశ్‌రెడ్డి,శైలకుమార్, మెమ్మడిశెట్టి సుధాకర్, శర్మ, గిరి పాల్గొన్నారు

రాయచోటి టౌన్ : రాయచోటి పట్టణంతోపాటు పాత రాయచోటి పరిధిలోని తొమ్మిది గ్రామ పంచాయతీలలో గణపయ్యలు వెలిశారు.

ఓబులవారిపల్లె : కొత్తమంగంపేట ఆర్ఆర్-1లో నిర్మిస్తున్న వరసిద్ధి వినాయకస్వామి గుడికి పారిశ్రామికవేత్త మాజీ వైస్ ఎంపీపీ గునిపాటి చెన్నరాయుడు రూ.లక్ష విరాళంతో పాటు నిర్మాణానికి అవసరమైన కంకరను కూడా ఇచ్చినట్లు గ్రామస్థులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గునిపాటి వేణుగోపాల్, కొటారు సుబ్రమణ్యం, లావలూరు చరణ్, పోతల రవిబాబు, పోతల లక్ష్మీనారాయణ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

కన్న కొడుకును కొట్టి చంపిన తండ్రి


సనావుల్లా మృతదేహం

రాయచోటి టౌన్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): కన్న కొడుకును తండ్రి దారుణంగా కొట్టి చంపిన సంఘటన బుధవారం రాయచోటిలో జరిగింది. పోలీసుల కథనం మేరకు రాయచోటి పట్టణం బోస్ నగర్ సమీపంలో కాపురముంటున్న శంషుద్దీన్ కుమారుడు సనావుల్లా మద్యానికి బానిసై డబ్బు కోసం కుటుంబ సభ్యులను వేధించేవాడు. బుధవారం మద్యం మత్తులో ఉన్న అతను తండ్రి శంషుద్దీన్‌పై కత్తితో దాడి చేశాడు. దాడి నుంచి తప్పించుకున్న తండ్రి ప్రాణ భయంతో కొడుకుపై ప్రతి దాడి చేసి చంపేశాడు. అనంతరం కొడుకు మృతదేహాన్ని ఫ్యానుకు వేలాడదీసి ఆత్మహత్యగా చిత్రీకరించే ప్రయత్నం చేశాడు. అయితే సనావుల్లా శరీరంపై గాయాలు స్పష్టంగా కనిపించడంతో పోలీసులు హత్యగా నిర్ధారించారు. అర్బన్ సీఐ వెంకటాచలపతి సంఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాయచోటి ఏరియా ఆసుపత్రికి తరలించారు. సనావుల్లా తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్‌కు తీవ్ర గాయాలు

రాయచోటి టౌన్, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ అనే కానిస్టేబుల్ తీవ్రంగా గాయపడ్డాడు. విధి నిర్వహణలో భాగంగా ద్విచక్ర వాహనంపై గ్రామాలకు వెళ్లిన కానిస్టేబుల్ ప్రసాద్ రాయచోటికి తిరిగి వస్తుండగా మునలిరెడ్డిగారిపలె సమీపంలో ఎదురుగా వచ్చిన ద్విచక్ర వాహనాన్ని తప్పించే యత్నంలో అదుపు తప్పి రోడ్డుపై పడి తీవ్రంగా గాయపడ్డాడు. అర్బన్ సీఐ వెంకటా చలపతి, బ్లూ కోట్స్ హెడ్ కానిస్టేబుల్ శంకర్ రాజు రాయచోటి ఏరియా ఆసుపత్రిలో ప్రథమ చికిత్స అనంతరం , బెంగళూరుకు తరలించారు.

బోయకొండ ఆలయ పాలకమండలికి 115 దరఖాస్తులు

చౌడేపల్లె, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి):ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ ఆలయ పాలక మండలి సభ్యత్వం కోసం 115 దరఖాస్తులు వచ్చినట్లు ఈవో ఏకాంబరం పేర్కొన్నారు.సెప్టెంబర్ ఒకటిన దరఖాస్తు దారులకు బోయకొండ ఆలయ కార్యాలయంలో ఉదయం 10.30గంటల నుంచి సర్టిఫికెట్ల పరిశీలన ఉంటుందన్నారు. దరఖాస్తు దారులందరూ హాజరు కావాలని కోరారు.

అవకతవకలకు పాల్పడితే కఠినచర్యలు : చమర్తి


ప్రసంగిస్తున్న టీడీపీ ఇన్‌చార్జి చమర్తి జగన్‌మోహన్‌రాజు

రాజంపేట, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : జాతీయ ఉపాధిహామీ పథకంలో అవకతవకలు జరిగితే సంబంధిత అధికారులపై చర్యలు తీసు కుంటామని రాజంపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి చమర్తి జగన్‌మోహన్‌రాజు తెలిపారు. గురువారం రాజంపేట మండలం బోయన పల్లెలో జరిగిన జాతీయ ఉపాధిహామీ పథకం అధికారుల సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఉపాధిహామీ పథకంలో అవకతవకలు జరిగాయని, ఈ పథకాన్ని పక్కదారి పట్టించారని ఆరోపించారు. పేదు, అట్టడుగువర్గాల సంక్షేమం కోసం అమలు చేస్తున్న ఈ పథకాన్ని పక్కదారి పట్టించి పలువురు లాభపడ్డారన్నారు. త్వరలో ఆ అవినీతిపై విచారణ చేసి కఠినచర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం ఉపాధిహామీ అధికారులు జగన్‌మోహన్‌రాజును ఘనంగా సత్కరించారు. ఏపీడీ ప్రతాప్, పంచాయతిరాజ్ డీఈ శ్రీనివాసులు పాల్గొన్నారు.

ప్రజా సేవలో విరగమ్మ మెమోరియల్ ట్రస్టు


విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న బయారెడ్డి

గాలివీడు ఆగస్టు 28;(ఆంధ్రజ్యోతి): ప్రజాసేవలో కానాల విరగమ్మ మెమోరియల్ ట్రస్టు ఎల్లప్పుడు ముందు వరసలో ఉంటుందని ఆ ట్రస్టు ఛైర్మన్, విశ్రాంత అధ్యాపకుడు, నాయవాది బయారెడ్డి తెలిపారు. గురువారం తన భార్య కానాల విరగమ్మ 11వ వర్ధంతి కార్యక్రమాన్ని పందికుంటలో ఘనంగా నిర్వహిం చారు. ఈ సందర్భంగా నూలివీడు జిల్లాపరిషత్ ఉన్నత పాఠ శాల 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు నగదు బహు మతులను అందజేశారు. ఇతర ప్రభుత్వ పాఠశాలలో చదువుతు న్న విద్యార్థులకు బ్యాగులు,నోటు పుస్తకాలు,పెన్నులు,పలకలు వంటివి అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాప కుడు యోగేశ్వర్‌రెడ్డి, ఉపాధ్యాయురాలు సౌభాగ్యమ్మ, మనోహర్ రెడ్డి, సుశీల తదితరులు పాల్గొన్నారు.

చమర్తిని టీడీపీ ఇన్‌చార్జిగా నియమిస్తూ అధికారిక ప్రకటన

రాజంపేట, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజును రాజంపేట నియోజకవర్గ టీడీపీ అసెంబ్లీ ఇన్‌చార్జిగా నియమిస్తూ ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసులు అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు ఇకనుంచి రాజంపేట లో చమర్తి జగన్ మోహన్‌రాజు నాయకత్వంలో కార్యక్రమాలు జరుగుతాయని వారు తెలిపారు.

శానిటరీ సెక్రటరీలకు షోకాజ్ నోటీసులు

ప్రొద్దుటూరు , ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : ట్రేడ్‌లైసెన్సు ఫీజు వసూళ్లలో నిర్లక్ష్యం ప్రదర్శించిన వార్డు శానిటరీ ఎన్విరాన్‌మెంట్ సెక్రటరీలకు మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. క్రమశిక్షణా చర్యలు ఎందుకు తీసుకోకూడదో సంజాయిషీ ఇవ్వాలని కోరారు. ట్రేడ్ లైసెన్సుల రెన్యువల్, కొత్తట్రేడ్‌లైసెన్సుల మంజూరులో వారు విఫలమయ్యారని బకాయిలు రాబట్టకపోవడం వలన తదుపరి చర్యలకు బాధ్యతవహించాలని ఆ నోటీసుల్లో పేర్కొన్నారు.

స్మార్ట్ మీటర్లను రద్దు చేయండి

● వామపక్షాల ఆధ్వర్యంలో విస్తృతంగా ర్యాలీలు



గాంధీ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న వామపక్ష నాయకులు

రైల్వేకోడూరు, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): విద్యుత్ స్మార్ట్ మీటర్లను వెంటనే రద్దు చేయాలని డిమాండు చేస్తూ వామపక్షాల నాయకులు జ్యోతి చిన్నయ్య, సీహెచ్ చంద్రశేఖర్ రైల్వేకోడూరు గాంధీ విగ్రహం వద్ద గురువారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బషీర్‌బాగ్ విద్యుత్ అమరుల స్ఫూర్తితో మరో విద్యుత్ పోరాటం చేయాల్సి వస్తుందన్నారు. విద్యుత్ ఉద్యమం జరిగి నేటికి 25 సంవత్సరాలు అయిందన్నారు. ఈ ఉద్యమంలో బషీర్‌బాగ్ సాక్షిగా వామపక్ష కార్యకర్తలు రామకృష్ణ, విష్ణువర్ధన్‌రెడ్డి, బాలస్వాములును అప్పటి ప్రభుత్వం పొట్టన పెట్టుకుందని ఆరోపించారు. ఈ ఉద్యమంలో ఎందరో ఉద్యమకారులు క్షతగాత్రులయ్యారని తెలిపారు. ప్రపంచ బ్యాంకు మోజులో సంస్కరణలు తీసుకుని వచ్చిన పాలకులను ఒక్క అడుగు వెనక్కి వేయించిందన్నారు. అదే స్ఫూర్తితో విద్యుత్ సంస్కరణలు, ప్రజలపై భారాలు, ప్రభుత్వ ప్రమాదకర విధానాల పై పోరాటం మరింత ఉధృతం చేసేందుకు ప్రతి ఒక్కరు ప్రతిన పూనాల్సి ఉందని పిలుపునిచ్చారు. వైసీపీ ప్రభుత్వంలో తీసుకుని వచ్చిన స్మార్ట్ మీటర్లను కూటమి ప్రభుత్వం కొనసాగిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు పండుగోల మణి, వామపక్ష నాయకులు లింగాల యానాదయ్య, తిప్పన ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రాజంపేట: విద్యుత్ సమస్యల పేరిట ప్రజల సొమ్మును రాష్ట్ర ప్రభుత్వం దోచుకుంటోందని ఆరోపిస్తూ వామపక్ష నేతలు స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి మహేష్, సీపీఎం జిల్లా నాయకులు రవికుమార్, సికిందర్, నాగేశ్వరరావు, బాలాజీ, రమణ, తదితరులు పాల్గొన్నారు.

రాయచోటి టౌన్ : కోర్టు పక్కన ఉన్న అంబేడ్కర్ ఫ్లెక్సీ వద్ద నిర్వహించిన ప్రదర్శనలో సీపీఐ జిల్లా కార్యదర్శి సి.పి.మహేశ్, నియోజకవర్గ కార్యదర్శి సిద్ధిగాళ్ల శ్రీనివాసులు, అంబేడ్కర్ సేన నాయకులు పల్లం తాతయ్య, పౌరహక్కుల సంఘం నాయకులు రెడ్డయ్య, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సాంబశివ, రైతు సంఘం జిల్లా కార్యదర్శి వంగిమల రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాటూరు శ్రీనివాసులరెడ్డి టీడీపీలో చేరిక


వైసీపీ నాయకులను టీడీపీలోకి ఆహ్వానిస్తున్న టీడీపీ ఇన్‌చార్జి రూపానందరెడ్డి

చిట్వేలి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : చిట్వేలి మండలంలో వైసీపీకి భారీ ఎదురు దెబ్బ తగిలింది. ఆ పార్టీకి చెందిన సీనియర్ నేత పాటూరు శ్రీనివాసులరెడ్డితోపాటు ముగ్గురు ఎం పీటీసీ సభ్యులు, ముగ్గురు సర్పంచ్ లు వారితో పాటు 650 కుటుంబాలు నియోజకవర్గ ఇన్‌చార్జి, కుడా ఛైర్మన్ ముక్కా రూపానందరెడ్డి ఆధ్వర్యంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. గురు వారం మండల పరిధిలోని కేఎస్ అగ్ర హారంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముక్కా రూపానందరెడ్డి కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం మాట్లాడుతూ ప్రజల అభిమానం, అభివృద్ధి పట్ల అంకితభావంతో చంద్రబాబునాయుడు నాయకత్వంలో రాష్ట్రం పురోగమిస్తుం దన్న నమ్మకంతో నేతలు టీడీపీలో చేరుతున్నారన్నారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యంతో మరుగున పడిన పలు ప్రాజెక్టు రోడ్లు త్వరలోనే పూర్తవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు పంతగాని నరసింహ ప్రసాద్, గుత్తి నరసింహ, టీడీపీ యువ నాయకులు పోతురాజు నవీన్, కట్టా బాలాజీ, మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ సంఘం రాజు రవికుమార్‌రాజు, సీనియర్ టీడీపీ నాయకులు గండికోట సుబ్బరాయుడు, మలిశెట్టి మురళీధర్‌గౌడ్, జనార్ధన్‌నాయుడు, మాజీ సర్పంచ్ శివయ్య, తల్లం వెంకటరమణారెడ్డి, సీనియర్ నాయకులు, కార్యకర్తలు భారీఎత్తున పాల్గొన్నారు.

రాజంపేటను జిల్లా కేంద్రం చేయాలని ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న జిల్లా సాధన సమితి నాయకులు

రాజంపేట, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): రాజంపేటను జిల్లా కేంద్రం చేయాలంటూ జిల్లా సాధన సమితి నాయకుడు తరిగోపుల లక్ష్మీనారాయణ, రాజంపేట ప్రైవేటు పాఠశాలల సంఘం నాయకుడు ప్రభాకర్‌నాయుడు, మైనార్టీ నాయకుడు గుల్జార్‌బాషా, రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ చెన్నూరు సుధాకర్, డాక్టర్ల సంఘం నాయకుడు డాక్టర్ నవీన్ తదిత రులు శుక్రవారం పట్టణంలోని రోడ్లు భవనాలశాఖ అతిథిగృహం నుంచి సబ్‌కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఎన్టీఆర్ సర్కిల్ వద్ద పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1902 లోనే సబ్‌కలెక్టర్ కార్యాలయం కలిగి, దేశంలోని అన్ని నగరాలకు రైల్వే వసతి, కడప, రేణిగుంట విమానాశ్రయాలకు సమీపంలో ఉన్న రాజంపేటను జిల్లా కేంద్రం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. గత ఎన్నికల్లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ఇచ్చిన ఎన్నికల హామీని అమలు చేయాలని వారు నినాదాలు చేశారు.

సీఎం సహాయ నిధి చెక్కు పంపిణీ


చెక్కు అందజేస్తున్న లక్ష్మీప్రసాద్ రెడ్డి

రామాపురం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నీలకంఠరావు పేటకు చెందిన సయ్యద్ మహబూబ్ బాషా సతీమణి సయ్యద్ రహజాన్‌కు మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును మంత్రి సోదరుడు మండిపల్లి లక్ష్మీప్రసాద్ రెడ్డి గురువారం అందజేశారు. మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి చొరవతో ప్రభుత్వం ఆమెకు రూ.90 వేల ఆర్థిక సాయం అందించింది. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు షేక్ నియాజ్, ఎన్.పెంచల్ రెడ్డి, ఎస్.సయ్యద్ పీర్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి


పరుగు పోటీలో పాల్గొంటున్న విద్యార్థులు

రైల్వేకోడూరు, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రీడల్లో రాణించాలని రైల్వేకోడూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎం. భాస్కర్‌రెడ్డి తెలిపారు. గురువారం జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా కళాశాల ఆవరణలో విద్యార్థులకు వంద మీటర్ల పరుగు, చెస్ తదితర క్రీడా పోటీలు నిర్వహించారు. గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘ సేవకులు పాములపాటి సుబ్బరాయుడు, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జి. రమేష్, ఐక్యూ ఏరియా కో-ఆర్డినేటర్ జి. దయానందం, కళాశాల ఫిజికల్ డైరెక్టర్ కుమారి, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ దాసరి మోషే, ఏ. శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

తూకాల్లో తేడాలు రాకుండా చూసుకోవాలి


అధికారులతో మాట్లాడుతున్న తహసీల్దార్ కోనేటి అమర్‌నాథ్

రైల్వేకోడూరు రూరల్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పౌర సరఫరాల గోదాములో ఉన్న నిత్యావసర వస్తువుల తూకాల్లో ఎలాంటి తేడాలు రాకుండా చూసుకోవాలని రైల్వే కోడూరు తహసీల్దార్ కోనేటి అమర్‌నాథ్ తెలిపారు. గురువారం రైల్వేకోడూరు పౌరసరఫరాల గోదామును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోదాములో రికార్డులు సక్రమంగా ఉన్నాయా లేవా అని పరిశీలించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లయి డీటీ శ్రీనివాసులు, గోదాము డీటీ రెడ్డిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కురుబల సంక్షేమానికి కృషి



మంగీరి సురేశ్

సుండుపల్లి, ఆంధ్రజ్యోతి 28: కురుబల సంక్షేమానికి అన్ని విధాలా కృషి చేస్తామని జిల్లా యువజన కమిటీ అధ్యక్షుడు మంగిరి సురేష్ తెలిపారు. గురువారం రాష్ట్ర అధ్యక్షుడు జబ్బల శ్రీనివాసులు, జిల్లా అధ్యక్షుడు ఈశ్వరయ్య ఆధ్వర్యంలో రాయచోటిలో సుండుపల్లి మండల కార్యవర్గం ఎంపిక చేశారు. జిల్లా యువజన కమిటీ అధ్యక్షుడిగా మంగిరి సురేష్, మండల అధ్యక్ష,గౌరవాధ్యక్షులు చెన్నకేశవ,చంద్రమోహన్ మాట్లాడుతూ కురుబలు సామాజికంగా, రాజకీయంగా, ఆర్థికంగా అభివృద్ధి సాధించాలంటే ఐకమత్యంతో ముందడుగు వేయాలని పిలుపునిచ్చారు. కురుబ లకు ఏ సమస్యవచ్చినా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. సుండుపల్లి మండల కురుబ సంఘం నాయకులకు కమిటీలో ప్రాధాన్యత కల్పించడం సంతోషదాయకం అన్నారు.

సేనతో సేనాని కార్యక్రమం పోస్టర్ ఆవిష్కరణ

నందలూరు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సౌమ్యనాథస్వామి ఆలయంలో మండల జనసేనపార్టీ నాయకులు సేనతో సేనాని పోస్టర్‌ను గురువారం విడుదల చేశారు. ఈ సందర్భంగా జనసేన నాయకులు మాట్లాడుతూ విశాఖ పట్టణంలో 28, 29, 30 తేదీల్లో జనసేనపార్టీ ఆ కార్యక్రమం నిర్వహిస్తోందన్నారు. సేనతో సేనాని కార్యక్రమం ద్వారా గ్రామ స్థాయి వరకు పార్టీ బలోపేతం చేయడమే ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రతి ఇంటికి పార్టీ సిద్ధాంతాలను చేరవేసి, ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వాటి పరిష్కారం కోసం కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల జనసేన పార్టీ నాయకులు కేదార్‌నాథ్, గురివిగారి వాసు, హోటల్ శివ, అరుణ్‌పాండే, మస్తాన్‌రాయల్, రాము మండెం, ప్రకాష్, ప్రతాప్, హరీష్, అజయ్, చిన్ను, సుబ్బు, జితేంద్ర, రవి తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాలు తనిఖీ


రికార్డులను పరిశీలిస్తున్న వ్యవసాయ విజిలెన్స్ అధికారులు

ఓబులవారిపల్లె/గాలివీడు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని ఎరువుల దుకాణాల్లో వ్యవసాయాధికారి మల్లిక, విజిలెన్స్ అధికారి మురళీకృష్ణ, గాలివీడులో విజిలెన్స్ అధికారి బాబు,మండల వ్యవసాయ అధికారి గౌతమి తనిఖీలు నిర్వహించారు స్టాకును, రికార్డులను పరిశీలించి ఎరువులను నిర్దేశిత ధరలకు అమ్మాలని కృత్రిమ కొరత సృష్టించ కూడదని డీలర్లకు తెలిపారు. అవసరం మేరకే వినియోగించుకోవాలని రైతులకు సూచించారు. వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

వయోజన విద్యపై శిక్షణ




మాట్లాడుతున్న ఎంపీడీవో మల్‌రెడ్డి

ఓబులవారిపల్లె, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): అక్షరాంధ్ర కార్య క్రమంలో భాగంగా ఎంపీడీవో అన్నారెడ్డి మల్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం ఎంఈవో రెడ్డ య్య వలంటీర్లకు శిక్షణ ఇచ్చారు. ప్రతి ఒక్కరికి కనీస విద్య అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాన్ని అర్హులైనవారు వినియోగించుకోవాలని సూచించారు.

ఆ పట్టాలకు పరిష్కారమెప్పుడో...?

- రైల్వేకోడూరు మండలంలో 17 వేల అతుకుబడి పట్టాలు
- జేసీ ఆధ్వర్యంలో ముమ్మరంగా కసరత్తు
- అయినా దొరకని మోక్షం
- సీసీఎల్ఏ నుంచి కదలని ఫైలు
- ఆగిపోయిన రిజిస్ట్రేషన్‌లు
- దిక్కుతోచని స్థితిలో బాధితులు



రైల్వేకోడూరు రూరల్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎక్కడా లేని సమస్య ఒక్క రైల్వేకోడూరులోని కొందరు రైతులకు ఎదురైంది. భూమి రికార్డుల్లో ఎక్కడా లేని విధంగా కొందరు రెవెన్యూ అధికారుల తప్పిదంతో అతుకుబడి అని చేర్చడంతో ఆ భూముల రిజిస్ట్రేషన్‌లు ఆగిపోయి బాధితులంతా దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. అతుకుబడి పట్టా అంటే భూమి లేని నిరుపేదలకు ప్రభుత్వం సాగు లేదా ఇంటి స్థలం కోసం కేటాయించిన భూమికి సంబంధించిన పట్టా. రైతులు పాస్‌పుస్తకాల్లో అతుకుబడి పట్టా ఉండడం చాలా అరుదు. ఒక రైల్వేకోడూరు మండలంలోనే సుమారు 17 వేల ఎకరాలకు సంబంధించిన రికార్డులు అతుకుబడి పట్టాగా నమోదు జరిగింది. ఎలా జరిగిందో తెలియదు గాని రైతు పాస్‌పుస్తకాలను ఆన్‌లైన్ చేసే క్రమంలో రైల్వేకోడూరు రెవెన్యూ శాఖలో పని చేస్తున్న ఓ కంప్యూటర్ ఆపరేటర్ 2012లో అతుకుబడి అనే పేరును ఎలా నమోదు చేశారో అంతు చిక్కని విషయంగా మారింది. గత టీడీపీ ప్రభుత్వంలో కానీ గత వైసీపీ ప్రభుత్వంలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా భూమి రిజిస్ట్రేషన్‌లు, భూమి రికార్డులో మార్పులు జరిగాయి. అయితే ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే భూముల సర్వేపై రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన కొత్త నిబంధలనతో ఈ అంశం తెరపైకి వచ్చింది. దీంతో రెవెన్యూ అధికారులు అతుకుబడిన భూములపై ప్రక్రియ ప్రారంభించారు. జయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ ఆదేశాల మేరకు గత తహసీల్దార్ మహబూబ్‌చాంద్ మండలంలోని అతుకుబడిన పట్టాల వివరాలను సేకరించి పూర్తి నివేదికను ఈ ఏడాది మార్చిలో కలెక్టర్ కార్యాలయానికి పంపించారు. జిల్లా కార్యాలయంలో అన్ని రికార్డులు పరిశీలించిన అధికారులు సీసీఎల్ఏకు నివేదికను పంపించారు. ఆరు నెలలు అవుతున్నా సీసీఎల్ఏలో ఇప్పటి వరకు ఎటువంటి పురోగతి లేదు. స్థానిక రైతులు ఎన్నిసార్లు ప్రభుత్వ కార్యాలయానికి వెళ్లినా ఒక వారంలో సమస్య పరిష్కారం అవుతుందని అధికారులు చెబుతున్నారని వాపోతున్నారు. అతుకుబడి ఉంటే భూమి ఆన్‌లైన్ కరెక్షన్ కూడా చేయలేని పరిస్థితి ఏర్పడింది. రైతు పట్టాదారు పాస్‌పుస్తకాల్లో జిరాయితీ అని ఉంటేనే రిజిస్ట్రేషన్ జరుగుతుంది. అతుకుబడి ఉంటే రిజిస్ట్రేషన్ జరగపోవడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో జరిగిన రెవెన్యూ సదస్సుల్లో అత్యధికంగా అతుకుబడి పట్టాలు ఉన్న రైతులు తమకు విముక్తి కల్గించాలని విన్నపాలు చేసుకున్నారు. అసలు జిరాయితీ అంటే ఎంటో అతుకుబడిన పట్టా అంటే ఏంటో తెలియక రైతుల అయోమయంలో ఉన్నారు. పిల్లల పెళ్లిళ్లు, ఉన్నత చదువుల కోసం భూములు అమ్మాలని భావించిన రైతులు తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా ఫలితం లేకపోవడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తెచ్చిన అప్పులు వడ్డీలతో పెరిగిపోతున్నాయని భూములు అమ్మి అప్పులు తీర్చాలని చూస్తున్నా అనుమతులు రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. ఇప్పటికైనా రెవెన్యూ మంత్రి, కలెక్టర్ తమ సమస్యను అర్థం చేసుకుని త్వరగా భూముల అమ్మకానికి అనుమతులు మంజూరు చేయాలని వేడుకుంటున్నారు.

అతుకుబడి పట్టాలకు అతి త్వరలోనే మోక్షం



అతుకుబడి పట్టాలకు అతి త్వరలోనే మోక్షం లభిస్తుంది. మండలంలో రైతుల సమగ్ర నివేదిక సిద్ధం చేసి జిల్లా అధికారులకు పంపించాము. జాయింట్ కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకుని పరిశీలిస్తున్నారు. జిల్లా అధికారులు దీనిపై ప్రత్యేకమైన శ్రద్ధ కనబరిచారు. రైతులకు క్రయవిక్రయాలు జరిగే విధంగా ప్రత్యేక చర్యలు తీసుకుంటాం. రైతులకు ఏ ఇబ్బంది లేకుండా చూస్తాం..

- కె.అమర్నాథ్, తహసీల్దార్, రైల్వేకోడూరు

ఇంకా ఎన్ని రోజులు వేచి చూడాలి.



నేను ఒక రైతు దగ్గర నుంచి ఇంకో రైతుకు పొలం అమ్మకం చేశాను. వారి నుంచి కొంత మొత్తాన్ని నగదు రూపంలో తీసుకున్నాను. రిజిస్ట్రేషన్ సమయంలో పుల్లంపేట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లగా ఆ భూమి విక్రయించలేరని వెళ్లి కోడూరు తహసీల్దార్‌ను సంప్రదించాలని సూచించారు. తహసీల్దార్‌ను సంప్రదించగా ఆ భూమి అతుకుబడిన పట్టా కిందకు వస్తుందని దీనిపై ఉన్నతాధికారులకు నివేదికలు పంపించామని త్వరలో పరిష్కారం అవుతుందని తెలిపారు. ఇప్పటికే 9 నెలలు గడుస్తున్నాయి. రైతులు నగదు చెల్లించాలని ఒత్తిడి చేస్తున్నారు. ఇంతకి భూమి రిజిస్ట్రేషన్ జరుగుతుందో లేదో అర్థం కావడం లేదు. జిల్లా స్థాయి అధికారులు స్పందించి న్యాయం చేయాలి.

- బాలాజీ, స్థానిక వ్యాపారస్తుడు

అంకాలమ్మ ఆలయానికి భూమి వితరణ



పత్రాలను గ్రామస్థులకు అందజేస్తున్న దృశ్యం

నిమ్మనపల్లి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): సామకోటవారిపల్లి పంచాయతీ నాయునివారిపల్లి వాసి ఆళ్లకుంట నారాయణ, క్రిష్ణమ్మ కుటుంబ సభ్యులు తరుణ్ వరలక్ష్మి గురువారం అంకాలమ్మ ఆలయ నిర్మాణానికి 10సెంట్ల భూమిని దానం చేశారు. వారు మాట్లాడుతూ నాయునివారిపల్లిలో అంకాలమ్మ గుడి ఏర్పాటు స్థలం లేకపోవడంతో తమ కుటుంబ సభ్యులు తమకు వున్న భూమిలోనే 10సెంట్ల భూమిని విరాళంగా ఇచ్చినట్లు తెలిపారు. అనంతరం గ్రామస్తులు మాట్లాడు తూ తమ గ్రామంలో దాదాపు 30కుటంబాలు వుండగా అంకాలమ్మ ఆలయ నిర్మాణం చేపట్టేందుకు భూమిని విరాళంగా ఇచ్చిన నారాయణ కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రెడ్డెప్ప, నాగరాజ, నరసింహులు, శేషాద్రినాయుడు, రవీంద్ర కృష్ణమ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

ములకలచెరువు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్రవాహనాలు ఢీకొనడంతో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు... దేవళచెరువు పంచాయతీ గోళ్లవారిపల్లెకు చెందిన శైలజ, మమత తమ అన్నతో పాటు ఓ ద్విచక్రవాహనంలో ములకలచెరువుకు వచ్చి తిరిగి స్వగ్రామానికి బయలుదేరారు. పెద్దపాళ్యం పంచాయతీ రామానాయుని కోటకు చెందిన చౌడప్ప మరో ద్విచక్రవాహనంలో ములకలచెరువుకు బయలుదేరాడు. ఈ క్రమంలో కొండకింద రైల్వేగేటు సమీపంలో వచ్చే సరికి రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో శైలజ, మమత, చౌడప్పకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో స్థానికులు చికిత్స నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

ధర్మకర్తల మండలి దరఖాస్తుల పరిశీలన



దరఖాస్తులు స్వీకరిస్తున్న దేవదాయ శాఖ అధికారులు

తంబళ్లపల్లె ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రం మల్లయ్యకొండ భ్రమరాంబ మల్లికార్జునస్వామి ఆలయ దర్మకర్తల మండలికి 35 మంది దరఖాస్తులు చేసుకున్నారని దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ విశ్వనాథ్ తెలిపారు.

గురువారం అసిస్టెంట్ కమిషనర్ ఆలయ ఈఓ మునిరాజ్, రికార్డ్ అసిస్టెంట్ కొండ కిట్టాతో కలిసి మల్లయ్యకొండకు వెళ్లి మల్లికార్జున స్వామిని దర్శించుకున్నారు. అర్చకులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేసి స్వామి వారి తీర్థప్రసాదాలను అందించారు. అనంతరం పాలక మండలికి అందిన దరఖాస్తులను పరిశీలించారు. పోలీస్ క్లియరెన్స్ సర్టిఫికెట్లు, కులధ్రువీకరణ పత్రాలు, ఇతర సర్టిఫికెట్లు జతచేయని వారు సోమవారం లోగా దేవాదాయ శాఖ కార్యాలయంలో సమర్పించాలని సూచించారు. కార్యక్రమంలో కూటమి నేతలు గ్రామస్తులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

రాయచోటి అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యం

- రాయచోటి మున్సిపాలిటీని నెంబర్-1గా తీర్చిదిద్దుతాం
- మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి



జేసీబీ ఎక్కి పనులను ప్రారంభిస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటి, నేతాజీ సర్కిల్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): రాయచోటి నియోజకవర్గం అభివృద్ధి, సంక్షేమం సమపాళ్లలో చేపడుతున్నామని, రాయచోటి మునిసిపాలిటీని నెంబర్ వన్‌గా తీర్దిదిద్దడమే లక్ష్యమని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. రాయచోటి పట్టణంలో రూ.3.50 కోట్లతో 36 అభివృద్ధి పనులను గురువారం ఆయన ప్రారంభించారు. మాండవ్య నది మరమ్మతు పనులను రూ.30 లక్షల వ్యయంతో చేపడుతున్నట్లు ఆయన తెలిపారు.

ఆ పనులను స్థానిక నాయకులతో కలిసి జేసీబీ ఎక్కి ప్రారంభించారు. పనుల విషయంలో నాణ్యత పాటించాలని తెలియజేశారు. అనంతరం మంత్రి క్యాంపు కార్యాలయంలో వివిధ సమస్యలతో వచ్చిన ప్రజల అర్జీలను స్వీకరించి పరిశీలించి తక్షణం సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యలను పరిష్కరించారు. ప్రజల సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించడమే కర్తవ్యమన్నారు. అందుకు అధికారులు సహకరించాలని తెలియజేశారు.

పేదలకు వరం సీఎం సహాయనిధి

అనారోగ్యంతో వైద్య సేవలు పొందిన నిరుపేదలకు సీఎం సహాయ నిధి వరం లాంటిదని మంత్రి తెలిపారు. తన క్యాంపు కార్యాలయంలో గురువారం 64 మంది లబ్ధిదారులకు రూ.71.24 లక్షల సహాయ నిధి చెక్కులు అందజేశారు. ఎన్టీఆర్ వైద్య సేవ కిందికి రాని అనారోగ్యాలకు సీఎం సహాయ నిధి ద్వారా ఆదుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు లక్ష్మీప్రసాద్‌రెడ్డి, మౌర్యా రెడ్డి, అర్చనా విద్యాసంస్థల అధినేత మదన మోహన్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ అనుంపల్లి రాంప్రసాద్ రెడ్డి, మురికినాటి సుబ్బారెడ్డి, గాజుల ఖాదర్‌బాషా, పలువురు నాయకులు పాల్గొన్నారు.

తాలూకా పోలీసులకు సీసీ కెమెరాలు వితరణ



తాలూకా సీఐకు సీసీ కెమెరాలు అందిస్తున్న దృశ్యం

మదనపల్లె టౌన్, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): మదనపల్లె తాలూకా పోలీసులకు విస్టా ఫుడ్స్ సంస్థ సీఎస్‌ఆర్ ఫండ్స్ కింద రూ.2లక్షల విలువైన అత్యాధునిక సీసీ కెమెరాలను అందజేశారు. గురువారం స్థానిక లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు మార్పురి వరుణ్, లయన్స్ ఆస్పత్రి చైర్మన్ బి.భాస్కర్‌నాయుడు, ఆధ్వర్యంలో విస్టా ఫుడ్స్ సంస్థ కార్యక్రమం నిర్వహించారు. లయన్ గౌతమ్‌రెడ్డి మాట్లాడుతూ తాలూకా సీఐ కళా వెంకటరమణ, విస్టా ఫుడ్స్ మేనేజర్ వేణుగోపాల్‌రెడ్డితో సీసీ కెమెరాలు గురించి చర్చించారన్నారు. దీనిపై సంస్థ యజమాని దృష్టికి తీసుకెళ్లి సీఎస్‌ఆర్(కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీ) రూ.2లక్షలు మంజూరు చేయించారన్నారు. ఈ మొత్తంతో అత్యాధునిక సీసీ కెమెరాలను కొనుగోలు చేసి మదనపల్లె తాలూకా పోలీసులకు అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు ఎస్ఎస్ ప్రసాద్, భాస్కరాచారి, మార్పురి మహేష్, కామకోటి ప్రసాదరావు, డాక్టర్ నివేదిత, రైల్వే వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసులపై దాడికి యత్నం.. కేసు నమోదు

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు : సీఐ



మాట్లాడుతున్న సీఐ సత్యనారాయణ

నిమ్మనపల్లి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): పోలీసులపై దాడికి ప్రయత్నించిన తుపాకుల రోహిత్‌కుమార్‌పై కేసు నమోదు చేసినట్లు మదనపల్లి రూరల్ సీఐ సత్యనారాయణ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ కొండయ్యగారిపల్లి పంచాయతీ వెంకోజిగారిపల్లి, దాసరిపేట వాసి రోహిత్ వేదిక వద్ద డీజే పాటలు పెట్టి అసభ్యకరంగా డ్యాన్సులు వేయడంపై ఎస్ఐ తిప్పేస్వామి ప్రశ్నించడాన్ని రోహిత్ మాఇష్టం అంటూ పోలీసులపై తిరగబడి మీరు ఎవరు చెప్పడానికి అంటూ వారిపై నానా బూతులతో తిరగబడ్డాడు.

అంతేకాకుండా పోలీస్‌స్టేషన్‌లో పోలీసులను కొట్టేందుకు ప్రయత్నించాడని తెలిపారు. విషయం తెలుసుకున్న డీఎస్పీ మహేంద్ర హుటాహుటిన నిమ్మనపల్లి పోలీస్‌స్టేషన్‌కు వచ్చి కేసు పూర్తి వివరాలు తెలుసుకున్నారు. యూనిఫాంలో వున్న పోలీసులపై చెయ్యిఎత్తి నానా బూతులు తిట్టినందుకు రోహిత్‌కుమార్‌ను అరెస్ట్ చేసి కేసు నమోదు చేసి రిమాండుకు తరలించినట్లు సీఐ తెలిపారు.

లారీ ఢీకొని యువకుడు మృతి

మదనపల్లె అర్బన్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): లారీ ఢీకొని తెలంగాణకు చెందిన యువకుడు మృతి చెందినట్లు తాలుకా పోలీసులు తెలిపారు. గురువారం మదనపల్లె మండలం, కొత్తవారిపల్లె సమీపంలో జాతీయ రహదారిలో బైక్‌పై వెళుతున్న యువకుడిని లారీ ఢీకొన్నది.

గుర్తు తెలియని లారీ వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో తెలంగాణ రాష్ట్రం గద్వాల్ జిల్లాకు చెందిన జాన్ (40) అక్కడికి అక్కడే మృతి చెందాడు స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి పోస్టు మార్టం నిమిత్తం మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. తాలుకా సీఐ కళా వెంకటరమణ కేసు దర్యాప్తు చేస్తునట్లు పేర్కొన్నారు.

ప్రభుత్వ ధరకే యూరియా విక్రయించాలి



యూరియా బస్తాలను పరిశీలిస్తున్న అడిషనల్ ఎస్పీ

ఒంటిమిట, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం నిర్ణయించిన ధరకే ప్రైవేటు డీలర్లు యూరియాను విక్రయించాలని కడప, అన్నమయ్య జిల్లాల విజిలెన్స్ అడిషనల్ ఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. గురువారం ఒంటిమిట్టలోని ఎరువుల దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం నిర్ణయించిన ధరకే యూరియాను అమ్మాలని, అధిక ధరలకు విక్రయించేవారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. జిల్లాలో యూరియా కొరత లేదని తెలిపారు. రైతుల అవసరాలకు తగినంత యూరియాను అందజేస్తామన్నారు. కాంప్లెక్సు ఎరువులు కొంటేనే యూరియా, నానో యూరియా కొంటేనే యూరియా ఇస్తామని చెప్పే ప్రైవేటు డీలర్లపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. రైతు సేవా కేంద్రాలకు కూడా విడతల వారీగా యూరియా పంపిణీ చేస్తామన్నారు. యూరియా బస్తా 266.50 రూపాయలకు విక్రయించాలని, అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవన్నారు. ఎరువుల దుకాణానికి వచ్చిన రైతులతో మాట్లాడారు. డీలర్లు సక్రమంగా యూరియా ఇస్తున్నారా లేదా, భయపెడుతున్నారా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో సీఐ బాబు, ఏడీ ఏ సురేష్‌కుమార్‌రెడ్డి, విజిలెన్స్ అధికారి గీతావాణి, మండల వ్యవసాయాదికారి మంజులరాణి, వ్యవసాయాధికారి కృష్ణ, సుమంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

రామాపురం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ యువకుడు మృతి చెందినట్లు ఎస్ఐ వెంకట సుధాకర్ రెడ్డి తెలిపారు. పోలీసుల కథనం మేరకు చిట్వూరు గ్రామం హరిజనవాడకు చెందిన ముదునూరు రమేశ్ (25), ద్విచక్ర వాహనంలో రాయచోటికి వెళుతుండగా ప్రేమాలయం సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. రామాపురం పోలీసులు మృతదేహాన్ని లక్కిరెడ్డిపల్లెలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అతనికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

పెండింగ్ పనులను పూర్తి చేయండి : కలెక్టర్

రాయచోటి (నేతాజీసర్కిల్), ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో చిన్న తరహా నీటి పారుదల ట్యాంకులను నింపే పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం అమరావతిలోని సచివాలయం నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ ప్రధానమంత్రి కుసుం పథకంతో పాటు చిన్న తరహా నీటి పారుదల ట్యాంక్‌ల నిర్వహణ, భూగర్భజలాలు పెంపుదల, వికలాంగ పెన్షన్లు, బాలల సంరక్షణ సంస్థల ఏర్పాట్లు తదితర అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. రాయచోటి కలెక్టరేట్ నుంచి కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, మదనపల్లె సబ్ కలెక్టర్ కళ్యాణి, డీఆర్‌వో మధుసూదన్‌రావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

భూతగాదాతో మహిళ ఆత్మహత్యాయత్నం



చికిత్స పొందుతున్న మంజుల

రామసముద్రం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): భూ తగాదా విషయమై కృష్ణప్ప కుమార్తె మంజుల ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. బలిజపల్లెలో గురువారం చోటుచేసుకున్న సంఘటనపై బాధిత మహిళ అందించిన వివరాల మేరకు మదనపల్లె మండలం కొత్తవారిపల్లె వాసి కృష్ణప్ప కుమార్తె మంజులకు రామసముద్రం మండలం బలిజపల్లెలో రెండెకరాలకు పైగా తండ్రి పేరుతో వ్యవసాయ భూమి ఉంది. ఆ భూమిని తన పెద్ద నాన్న గజ్జల వెంకటరమణ కబ్జా చేశాడని ఆరోపిస్తోంది. తన తండ్రి పేరుతో ఉన్న భాగం సర్వే చేసి తనకు ఇవ్వాలని ఏడాదిన్నరగా పలు మార్లు ప్రజా సమస్యల పరిష్కారం వేదిక, తహసీల్దార్లకు ఫిర్యాదు చేసినట్లు తెలిపింది.

గురువారం భూ సర్వే చేయడానికి రెవెన్యూ అధికారులు వివాదాస్పద భూమి వద్దకు చేరుకున్నారు. అయితే ఈ భూమిపై కోర్టులో కేసు నడుస్తోందని అందువల్ల భూమి సర్వే చేయడానికి వీలు లేదని మరో వర్గం వారు రెవెన్యూ అధికారులకు చెప్పడంతో చేసేది లేక రెవెన్యూ అధికారులు వెనుతిరిగారు. దీంతో తనకు ఇక న్యాయం జరగదని బావించిన బాధిత మహిళ అధికారుల సమక్షంలో విషం తాగి ఆత్మహత్యకు యత్నించగా కుటుంబీకులు ఆమెను వెంటనే మదనపల్లె జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

పింఛన్ కోసం దివ్యాంగుడి పోరాటం

- సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌కు వినతి



యువగళంలో లోకేశ్‌తో సాయిశరత్ (ఫైల్)

మదనపల్లె, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): శారీరక సమస్యతో బాధ పడుతున్న ఓ అభాగ్యుడి వేదన ఇది. చిన్నప్పటి నుంచీ వికలత్వంపై పోరాటం చేస్తూ డిగ్రీ వరకు చదువుకున్నాడు. అటు ఉద్యోగం లేక, ఇటు ఉపాధి దొరక్క ఇంటికే పరిమితమయ్యాడు. 27 ఏళ్ల వయసున్న అతడు ఇప్పటికీ తల్లిదండ్రుల మీదనే ఆధారపడాల్సి వస్తోంది. కొంతలో కొంత ఊరటనిచ్చేలా వస్తున్న దివ్యాంగ పింఛన్‌ను గత వైసీపీ ప్రభుత్వం ఆపేసింది. దీంతో ఆయన పరిస్థితి దయనీయంగా మారంది. పింఛన్ పునరుద్ధరించాలని కోరుతున్నా ఎవరూ స్పందించడం లేదని వాపోతున్నాడు.

మదనపల్లె మండలం కొత్తయిండ్లు పంచాయతీ తాళ్లసుబ్బన్న కాలనీకి చెందిన రాటకొండ వెంకటరమణనాయుడు కుమారుడు సాయిశరత్ శారీరక సమస్యతో బాధపడుతున్నాడు. లేస్తే సరిగ్గా కూర్చోలేని పరిస్థితి, కూర్చుంటే ఇక లేవలేని పరిస్థితి సాయిశరత్‌ది. కాళ్లు చచ్చుబడిపోయి నిల్చోలేని, నడవలేని దయనీయ స్థితి. మెరుగైన చికిత్స కోసం తిరగని ఏరియా లేదు..చూపించని ఆసుపత్రీ లేదు. తిరుపతి, బెంగళూరు, చెన్నై, తదితర ప్రాంతాల్లో వైద్యంతోపాటు కాళ్లకు రెండుసార్లు శస్త్రచికిత్సలు చేయించినా ప్రయోజనం లేదు. ఈ పరిస్థితిలో 2011 నుంచి వస్తున్న దివ్యాంగ పింఛన్ 2022లో అప్పటి జగన్ ప్రభుత్వం రద్దు చేసింది. తండ్రి వెంకటరమణనాయుడు గుండెజబ్బు పేషంట్ కావడంతో తండ్రీ కొడుకులు ఇద్దరూ ఆసుపత్రికి వెళ్లడానికి చిన్నపాటి కారు ఉండేది. నాలుగు చక్రాల వాహనం పేరుతో పింఛన్‌ను రద్దు చేశారు. తర్వాత ఆ కారును ఆసుపత్రుల ఖర్చు నిమిత్తం అమ్మేశారు. కారు బాధితుడి పేరుతో లేదని, ఇతరుల పేరున రిజిస్ట్రేషన్ మారిపోయిందని స్థానిక మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ లెటర్ కూడా ఇచ్చారు.

కొత్తగా పింఛన్‌కు దరఖాస్తు చేసుకోవడానికి సచివాలయానికి వెళితే డీటీసీ లాగిన్‌లో పెండింగ్ ఉన్నట్లు చూపుతోంది. ఈ సమస్యను పరిష్కరించాలని, స్థానిక సచివాలయం నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేసినా సమస్య పరిష్కారం కాలేదు.

అంతకు ముందు కూడా బాధితుడు సాయిశరత్ అప్పటి టీడీపీ యువ నేత నారా లోకేశ్ యువగళం పాదయాత్రలో 2023లో మదనపల్లెకు వచ్చినప్పుడు పింఛన్ పునరుద్ధరించాలని వినతిపత్రం అందచేశారు. అలాగే గత ఏడాది నవంబరు 20న విజయవాడకు వెళ్లి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు కూడా వినతిపత్రం అందజేశారు. తర్వాత సీఎంవో కార్యాలయం నుంచి సమాచారం వచ్చినా..బాధితునికి ఇప్పటికీ పింఛన్ అందలేదు. 84 శాతం వికలత్వం ఉన్నట్లు సదరన్ క్యాంపులో వైద్యులు జారీ చేసిన సర్టిఫికెట్‌ను చేతపట్టుకుని సాయిశరత్..అటు అధికారులు, ఇటు రాజకీయ నాయకులను ఆశ్రయిస్తున్నా ఎటువంటి ప్రయోజనం లేదని వాపోతున్నాడు.

వ్యాపారులకు ప్రభుత్వం చేయూత



సమావేశంలో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి

రాయచోటి (నేతాజీ సర్కిల్), 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వ్యాపార సౌలభ్యానికి ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం చేయూతనందిస్తుందని మదనపల్లె సబ్‌కలెక్టర్ కళ్యాణి తెలిపారు. గురువారం రాయచోటిలోని కలెక్టరేట్ పీజీఆర్ఎస్ హాలులో మదనపల్లె సబ్ కలెక్టర్ అధ్యక్షతన బిజినెస్ రిఫార్మ్ యాక్షన్ ప్లాన్ అవుట్ రీచ్ కార్యక్రమాన్ని జిల్లా పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పెట్టుబడిదారులకు అనుకూల వాతావరణం కల్పించేందుకు కృషి చేస్తూ దేశవ్యాప్తంగా ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో అగ్రస్థానాన్ని సాధించిందని తెలిపారు. 2016 నుంచి 2020 వరకు వరుసగా మొదటి స్థానంలో నిలిచిందన్నారు. సులభతర వ్యాపారం చేయడంలో మన రాష్ట్రం ముందంజలో ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిశ్రల అధికారి కృష్ణకిషోర్ కేపీఎంజీ ప్రతినిధి రవితేజా, తదితరులు పాల్గొన్నారు.

మెనూ అలా.. ధరలు ఇలా..

అమలు చేసేదెలా ?

- ఆకాశాన్నంటుతున్న నిత్యావసర ధరలు
- పెరగని మెస్ చార్జీలు
- పెండింగ్‌లో బిల్లులు
- తలలు పట్టుకుంటున్న సంక్షేమశాఖ అధికారులు


వేముల సాంఘిక సంక్షేమ వసతిగృహంలో భోజనం చేస్తున్న విద్యార్థులు (ఫైల్‌ఫొటో)

ప్రభుత్వం సంక్షేమ వసతిగృహాల విద్యార్థులకు అందించే మెనూ సూపర్బ్ అనిపించింది. ఇక తమ పిల్లలకు నాణ్యమైన భోజనం అందుతుందని తల్లిదండ్రులు సంబరపడ్డారు. కానీ నిత్యావసర ధరలు అమాంతం పెరిగిపోవడంతో నిబంధనల మేరకు మెనూ అమలు చేసేదెలా అని ఆ శాఖ అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ధరలకనుగుణంగా మెస్ చార్జీలు పెరగకపోవడంతో సమస్యలు ఎదురవుతున్నాయి. పైగా గత ప్రభుత్వం బిల్లులు పెండింగులో పెట్టడంతో అధికారులకు మరింత భారమైంది. అప్పులు చేసి మరీ పిల్లల కడుపు నింపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక కొంత మేర బిల్లులు చెల్లించినా ఇంకా పెండింగ్‌లో ఉన్నాయని అధికారులు వాపోతున్నారు.

కడప ఎన్టీఆర్‌సర్కిల్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రస్తుతం బీసీ, ఎస్సీ, ఎస్టీ వసతిగృహాలన్నీ కలిపి వంద వరకు ఉన్నాయి. సాంఘిక సంక్షేమ శాఖ పరిధిలోని 67 వసతిగృహాల్లో 6756 మంది విద్యార్థులున్నట్లు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. గిరిజన సంక్షేమ వసతిగృహాల్లో 430 మంది, బీసీ సంక్షేమ వసతిగృహాల్లో 4వేల మందికి పైగా వసతి పొందుతున్నారు. గత ప్రభుత్వం ఏడెనిమిది నెలలుగా బిల్లులు పెండింగులో పెట్టేయడంతో విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనాలు వడ్డించేందుకు వసతిగృహాల సంక్షేమ అధికారులు నానా అవస్థలు పడ్డారు. నెలల తరబడి బిల్లులు పెండింగులో ఉండడంతో కొంత వరకు దుకాణదారులు కూడా సరుకులు ఇచ్చేందుకు వెనుకాడే పరిస్థితి కనిపించింది. ఈ క్రమంలో కొంతమంది సంక్షేమ అధికారులు అప్పులు చేసి వసతిగృహాల్లోనే పిల్లల కడుపు నింపే పరిస్థితి ఏర్పడింది. కూటమి ప్రభుత్వం వచ్చాక ఏప్రిల్ నెల వరకు బిల్లులు ఇచ్చారు. ప్రస్తుతం మూడు నెలలకు సంబంధించిన బిల్లులను అందించేందుకు రికార్డులు సిద్ధం చేసినట్లు అధికారులు చెబుతున్నారు.

ధరల్లో వ్యత్యాసం

నిత్యావసర ధరలు ఎప్పటికప్పుడు ఇబ్బడి ముబ్బడిగా పెరుగుతుండడంతో మెనూ అమలు ప్రశ్నార్థకంగా మారింది. ప్రస్తుతం ఇస్తున్న డైట్ చార్జీలతో నిర్దేశిత మెనూ ఉంటుందని వార్డెన్లు వాపోతున్నారు. రోజూ ఉదయం పాలు, అల్పాహారం, వేరుశెనగ చిక్కీలు, వారంలో ఆరు సార్లు కోడిగుడ్లు, మూడురోజులు కోడిమాంసం, రోజూ రాత్రి పూట భోజనం తరువాత అరటిపండు ఇవ్వాల్సి ఉంది. ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనాల్లో కూర, పెరుగు తప్పనిసరి. ఆదివారం కాకుండా మిగతా సెలవు రోజుల్లో మధ్యాహ్న భోజనంలో సాంబారు, గుడ్డుకూర ఉండాలి. ఈ క్రమంలో ప్రభుత్వం విద్యార్థులకిస్తున్న డైట్ చార్జీలు పరిశీలిస్తే 3-5వ తరగతి వరకు విద్యార్థులకు మెస్ చార్జీల కింద ఒక్కొక్కరికి నెలకు రూ.1150 చొప్పున, 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు రూ.1400 చొప్పున, ఇంటర్, ఆపై చదివే విద్యార్థులకు రూ.1600 లెక్కన ప్రభుత్వం ఇస్తుంది. 2023లో సవరించిన డైట్‌చార్జీల ప్రకారం గమనించినట్లయితే కోడిగుడ్డుకు రూ.3 చొప్పున ప్రభుత్వం ఇస్తుంది. బయట మార్కెట్‌లో వాటి ధర రూ.6.50 పైసలుగా ఉంది. అదే విధంగా కిలో చికెన్‌కు రూ.90, కందిపప్పు, పామాయిల్‌పై మరో రూ.40 అదనంగా పడుతుంది. ఇక కూరగాయల ధరలు చెప్పలేని పరిస్థితి. నిత్యావసర ధరలు అన్నీ పెరిగిపోయాయి. ప్రస్తుత ధరలకనుగుణంగా మెస్‌చార్జీలు పెంచాలని అటు వసతిగృహాల సంక్షేమ అధికారులు ఇటు విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

ఇదే అదనుగా

మెస్‌చార్జీలు నిత్యావసర ధరలకనుగుణంగా లేవనే కారణంతో కొన్ని వసతిగృహాల్లో సంక్షేమ అధికారులు కొంత మంది చేతివాటం ప్రదర్శిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. విద్యార్థుల హాజరుకనుగుణంగా వంటలు చేయాల్సి ఉంటుంది. కానీ కొన్ని వసతి గృహాల్లో విద్యార్థుల హాజరు కంటే తక్కువ మంది భోజనం చేస్తున్నట్లు సమాచారం. ఈ క్రమంలో అటు సంక్షేమ అధికారులు కానీ, వసతిగృహాల్లో పనిచేసే సిబ్బంది నిత్యావసర వస్తువులను ఇళ్లకు తరలించే పని పెట్టుకున్నట్లు ఆరోపణలు లేకపోలేదు. ఏదేమైనా ప్రభుత్వం కూడా వాస్తవిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని క్షేత్రస్థాయిలో పేద విద్యార్థులకు కడుపు నిండా భోజనం పెట్టేందుకు ఎప్పటికప్పుడు డైట్ చార్జీలు సవరించాల్సిన అవసరం ఉంది.

ఈ విషయమై సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టరు సరస్వతిని ఆంధ్రజ్యోతి వివరణ కోరగా, వసతిగృహాల్లో విద్యార్థుల హాజరు పక్కాగానే ఉంటుందని, ఎక్కడా అక్రమాలకు తావు లేకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తూ విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

13న జాతీయ లోక్ అదాలత్

● జిల్లా ప్రధాన జడ్జి యామిని

కడప రూరల్, అగస్టు 28(ఆంధ్రజ్యోతి): జాతీయ, రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థల ఆదేశాల మేరకు జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో సెప్టెంబరు 13న ఉమ్మడి కడప జిల్లా వ్యాప్తంగా జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు డీఎల్‌ఎస్‌ఏ చైర్‌పర్సన్, జిల్లా ప్రధాన న్యాయాధికారి డాక్టర్ సి.యామిని తెలిపారు. జాతీయ లోక్ అదాలత్‌ను సంబంధిత శాఖల అధికారులు, న్యాయవాదులు, కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. జాతీయ లోక్‌అదాలత్‌లో ఒకసారి కేసు పరిష్కారమైతే సుప్రీంకోర్టు తీర్పుతో సమానమన్నారు. తిరిగి అప్పీల్ చేసుకోవడానికి వీలుపడదన్నారు. పైగా సమయం, డబ్బు ఆదా అవుతాయన్నారు. కక్షిదారుల మధ్య వ్యక్తిగత సంబంధాలు దెబ్బతినవన్నారు. ఇలాంటి ప్రయోజనాలు కలిగిన జాతీయ లోక్ అదాలత్‌ను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కారు ఢీకొని వృద్ధురాలు మృతి



జమ్మలమడుగు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు మండలం మోరగుడి రచ్చబండ వద్ద బుధవారం రాత్రి కారు ఢీకొని పల్లా రాజేశ్వరి (65) అనే వృద్ధురాలు మృతిచెందారు. మోరగుడి రచ్చబండ సమీపాన కొలువైన వినాయక విగ్రహం వద్ద పూజలు చేసి తిరిగి ఇంటికి వస్తుండగా జమ్మలమడుగు వైపు నుంచి మైలవరం వెళ్లే ఓ కారు ఢీకొంది. ఈ ఘటనలో ఆమెకు తీవ్రగాయాలు కాగా దగ్గరే ఉన్న ఆర్‌ఎంపీ వద్దకు తీసుకెళ్లి చికిత్స చేయించామని కుటుంబసభ్యులు తెలిపారు. పరిస్థితి విషమంగా ఉండటంతో పల్లా రాజేశ్వరిని జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. ఆమెను ఢీకొన్న కారు ఆగకుండా వెళ్లిపోవడంతో మైలవరంలో వారిని అదుపులోకి తీసుకుని గురువారం ఉదయం జమ్మలమడుగు అర్బన్ పోలీసు స్టేషన్‌కు తెచ్చినట్లు పోలీసులు తెలిపారు.

కరెంటు షాక్‌తో యువకుడి మృతి



కడప క్రైం, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): కడప నగరం బాలాజీనగర్‌లో వినాయక మండపం వద్ద ఓ యువకుడు సెల్‌ఫోను చార్జింగ్ పెట్టే సమయంలో కరెంటు షాక్ తగిలి మృతిచెందాడని తాలూకా ఎస్‌ఐ తులసీనాగప్రసాద్ తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల మేరకు.. కడపనగరం రాజారెడ్డివీధికి చెందిన సుమన్‌తేజ (20) క్యాటరింగ్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. బుధవారం సాయంత్రం వర్షం పడుతున్న సమయంలో సుమన్ తేజ తడుచుకుంటూ వచ్చి సెల్‌ఫోను చార్జింగ్ పెట్టేందుకు వినాయక మండపంలోని విద్యుత్ వైరును లాగాడు. దీంతో షాక్‌కు గురై అక్కడికక్కడే కుప్పకూలి ప్రాణాలు వదిలాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

నృత్య, సంగీత కోర్సులల్లో ప్రవేశాలు

కడప ఎడ్యుకేషన్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): యోగి వేమన విశ్వవిద్యాలయంలోని లలిత కళల శాఖ ఆధ్వర్యంలో కూచిపూడి, కర్ణాటక సంగీతం, కీబోర్డు సర్టిఫికెట్ కోర్సులలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ డాక్టర్ టి.లక్ష్మీప్రసాద్ తెలిపారు. ప్రవేశాల ప్రక్రియ ఈనెల 28వ తేదీ నుంచి సెప్టెంబరు 12వ తేదీ వరకు కొనసాగుతుందన్నారు. పదేళ్ల వయసు నిండినవారి నుంచి తర్వాత ఏ వయసు వారైన ఈ కోర్సుల్లో చేరవచ్చని, మరిన్ని వివరాలకు 9032595101నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

యువత పారిశ్రామికంగా ముందడుగు వేయాలి

కడప మారుతీనగర్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందించే రుణాలను సద్వినియోగం చేసుకుని యువత పారిశ్రామికంగా ముందడుగు వేయాలని పరిశ్రమల కేంద్రం జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఫ్లాగ్‌షిప్ పథకాలపై గురువారం స్థానిక బాలాజీనగర్‌లో ఉన్న నెహ్రూ యువకేంద్ర కార్యాలయంలో వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సహకారంతో చిన్నస్థాయి నుంచి భారీ స్థాయి పరిశ్రమలు ఏర్పాటుచేసే దిశగా నిరుద్యోగ యువత అడుగులు వేయాలన్నారు. పీఎంఈజీపీ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం గ్రామీణ నిరుద్యోగులకు 35 శాతం వరకూ సబ్సిడీ రుణాలు అందిస్తోందన్నారు. కార్యక్రమంలో మై భారత్ జిల్లా యువజన అధికారి ప్రదీప్‌కుమార్, మైభారత్ యూత్ కార్యాలయ అకౌంట్, ప్రోగ్రామ్ సూపర్‌వైజర్ బాబురెడ్డి పాల్గొన్నారు.

పీవోపీ విగ్రహాలు పర్యావరణానికి హానికరం


అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

సింహాద్రిపురం, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): పీవోపీ (ప్లాస్టర్ ఆఫ్ పారిస్) విగ్రహాలు పర్యావరణానికి హానికరమని సింహాద్రిపురం జడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తెలిపారు. గురువారం ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి సింహాద్రిపురంలో 26 చోట్ల ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలను దర్శించి, గ్రామ ఉత్సవ కమిటీ సభ్యులతో మాట్లాడారు. పీవోపీ విగ్రహాలను చెరువులు, కుంటలలో నిమజ్జనం చేయడం వలన నీరు కలుషితమవుతుందని, ఇది చేపలు, ఇతర జల జీవులకు ప్రమాదకరమని తెలిపారు. అలాగే గ్రీన్‌హౌస్ గ్యాసెస్ పెరగడం, గ్లోబల్ వార్మింగ్, యాసిడ్ రైన్స్, అకాల వర్షాలు సంభవించే ప్రమాదముందన్నారు. ఇకపై మట్టి విగ్రహాలు, ఎకో-ఫ్రెండ్లీ విగ్రహాలు వాడినట్లయితే పర్యావరణంతో పాటు మన సంప్రదాయాలను కూడా కాపాడినట్లవుతుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సూర్యశ్చంద్రారెడ్డి, పద్మనాభరెడ్డి, జయప్రకాష్‌రెడ్డి, బాలకృష్ణారెడ్డి, విద్యార్థులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కడప ఇన్‌చార్జి డీటీసీగా అనంతపురం డీటీసీ

కలికిరి/కడప, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం ఖాళీగా వున్న కడప డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనరు పోస్టుకు ఇన్‌చార్జిగా అనంతపురం డీటీసీగా పనిచేస్తున్న ఎం.వీర్రాజును నియమిస్తూ ప్రభుత్వం గురువారం ఆదేశాలు జారీ చేసింది. తదుపరి ఉత్తర్వులిచ్చేంత వరకూ పరిపాలనాపరమైన కారణాలతో వీర్రాజును పూర్తి అదనపు బాధ్యతలతో కడప డీటీసీగా కొనసాగిస్తూ రవాణా, రహదార్ల శాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే ఉత్తర్వులు జారీ చేశారు.

స్టెప్ సీఈవో డెప్యుటేషన్ రద్దు

కలికిరి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లా యువజన సర్వీసులకు సంబంధించిన 'స్టెప్' (సొసైటీ ఫర్ ట్రైనింగ్ అండ్ ఎంప్లాయ్‌మెంట్ ప్రమోషన్) సీఈవోగా పనిచేస్తున్న సి.సాయిగ్రేస్ డెప్యుటేషన్‌ను రద్దు చేస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం సాయిగ్రేస్ ప్రజారోగ్యం, కుటుంబ సంక్షేమ శాఖ నుంచి డెప్యుటేషన్‌పై 'స్టెప్' సీఈవోగా పనిచేస్తున్నారు. సాయిగ్రేస్‌ను మాతృ సంస్థకు తిప్పి పంపేందుకు తగిన చర్యలు తీసుకోవలసిందిగా యువజన సర్వీసుల శాఖ కమిషనరు, స్టెప్ డెరెక్టరును ఆదేశిస్తూ రాష్ట్ర యువజన సర్వీసులు, క్రీడలు, పర్యాటక, సాంస్కృతిక శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి అజయ్ జైన్ గురువారం ఆదేశాలు జారీ చేశారు.

ఆర్టీసీలో పర్మినెంట్ ఉద్యోగాలు కల్పించాలి

మంత్రికి ఏపీ టీఏటీయూ వినతి

ప్రొద్దుటూరు అర్బన్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలో పర్మినెంట్ ఉద్యోగాలు కల్పించాలని ఆంధ్రప్రదేశ్ టెక్నికల్ అప్రెంటిషిప్ ట్రేడ్ యూనియన్ జోనల్ సెక్రటరి రాజనాల రాజేశ్ కోరారు. ఆమేరకు ఏపీ టీఏటీయూ సభ్యులతో పాటు గురువారం రోడ్డు రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని కడప విమానాశ్రయంలో కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐటీఐ విద్యార్హతతో ఏపీఎస్‌ఆర్టీసీలో 1961 యాక్టు అప్రెంటీస్ శిక్షణ పూర్తి చేసుకున్న వారిలో పలువురికి ప్రస్తుతం ఉద్యోగం, ఉపాధి లేక జీవనం భారంగా మారిందన్నారు. 2011 నుంచి 2025 వరకు ఏపీఎస్‌ఆర్టీసీ గ్యారేజీలో ఉద్యోగాలు భర్తీ చేయలేదన్నారు. ఏపీ టీఏటీయూ సభ్యులకు వయోపరిమితి పెరిగిపోతోందని, ఇప్పటి వరకు పర్మినెంట్ ఉద్యోగాలు లేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. రాష్ట్రమంతటా ఏపీఎస్‌ఆర్టీసీలో అప్రెంటీస్‌గా చేసి ఎంతో మంది ఉద్యోగాలు రాక నిరుద్యోగులుగా మిగిలారని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకుపోయి తమకు ఆర్టీసీలో పర్మినెంట్ ఉద్యోగ అవకాశం కల్పించాలని కోరారు.

క్వాంటమ్ కంప్యూటింగ్‌పై సదస్సు

వేంపల్లె, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): అమరావతిలో క్వాంటమ్ కంప్యూటింగ్ ఐబీఎమ్ ద్వారా టెక్నాలజీని ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో గురువారం ఇంటర్నల్ క్వాంటమ్ కంప్యూటింగ్‌పై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ కుమారస్వామి గుప్తతో పాటు ట్రిపుల్‌ఐటీ పరిపాలన విభాగం అధికారులు, హెచ్‌ఓడీలు మాట్లాడుతూ.. సమాజానికి అవసరమైన సమస్యలతో పాటు కంప్యూటింగ్ క్వాంటమ్ కమ్యూనికేషన్, భద్రత, మెడికల్, బ్యాంకింగ్ రంగం, వ్యవసాయ రంగాలకు అమలు చేసేందుకు భవిష్యత్తు ప్రణాళికలు జరుగుతున్నాయని తెలిపారు. క్వాంటమ్ కంప్యూటింగ్‌పై నైపుణ్యతను పరీక్షించే పోటీలు ఉన్నాయని, రీజనల్ స్థాయిలో ఎంపికైన వారికి రాష్ట్రస్థాయి పోటీలు అమరావతి క్వాంటమ్ వ్యాలీలో సెప్టెంబర్‌లో జరుగుతాయన్నారు. సుమారు వందమంది విద్యార్థులు 25 విభాగాల్లో టెక్నాలజీకి సంబంధించి నైపుణ్యాలను ప్రదర్శించారన్నారు. ఇందులో అత్యుత్తమ ప్రతిభ చూపిన వారిని తదుపరి లెవెల్ పోటీలకు వెళ్తారని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పరిపాలన అధికారి పెనుగొండ రవికుమార్, రత్నకుమారి, కొండారెడ్డి, అరుణ్, రమేష్,సుధాకర్‌రెడ్డి, కార్తీక్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అధిక రేట్లకు అమ్మితే లైసెన్సు రద్దు చేస్తాం

కమలాపురం రూరల్, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): ఎరువుల దుకాణాల యాజమాన్యాలు రైతులకు అధిక రేటుకు అమ్మితే వారి లైసెన్సులు రద్దు చేస్తామని జిల్లా వ్యవసాయ అధికారి చంద్రనాయక్ తెలిపారు. గురువారం ఆయన సహాయ వ్యవసాయ సంచాలకులు ఏపీ నరసంహారెడ్డితో కలిసి పట్టణంలోని ఎరువుల దుకాణాలను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ఖరీఫ్ సీజన్‌కు మండలంలో 291 మెట్రిక్ టన్నుల యూరియా పంపిణీ చేయడం జరిగిందని, ఇప్పటి వరకు ఎటువంటి కొరత రాలేదని తెలిపారు. కార్యక్రమంలో విజిలెన్స్ ఏసీ సుధాకర్, సీఐ రోషన్, మండల వ్యవసాయాధికారి సరస్వతి పాల్గొన్నారు.

కోర్టు డిక్రీ కేసులో రూ.26.50 లక్షలు మంజూరు

కలికిరి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): జలవనరుల శాఖకు చెందిన చిన్న నీటిపారుదల శాఖకు సంబంధించి కడప జిల్లా సీనియర్ సివిల్ జడ్జి కోర్టు మంజూరు చేసిన డిక్రీ వ్యవహారంలో రూ.26.50 లక్షలు మంజూరు చేస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం అన్నమయ్య జిల్లా వీరబల్లి మండలంలో మాండవ్య నదిపై జరిగిన ఆనకట్ట నిర్మాణం, కాలువల తవ్వకం పనులకు సంబంధించి కడప సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో 2005లో కేసు నమోదయింది. దీనిపై 2007లో మరో ఎగ్జిక్యూషన్ పిటిషన్‌లో వెలువడిన ఉత్తర్వుల మేరకు ఈ వివాదాన్ని ముగించడానికి రూ.26.50 లక్షలు మంజూరు చేస్తున్నట్లు ప్రభుత్వం పేర్కొంది. మళ్లీ ఈ వివాదం కొనసాగకుండా మరోమారు అన్ని లెక్కలు సరిచూసి పూర్తి చెల్లింపులు చేయాలని కూడా చీఫ్ ఇంజినీరుకు ప్రభుత్వం సూచించింది. ఆర్థిక శాఖ ముందస్తు ఆమోదం నిధులు మంజూరు చేస్తున్నట్లు పేర్కొంటూ జలవనరుల శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జి.సాయిప్రసాద్ గురువారం ఆదేశాలు జారీ చేశారు.

మైనంపాటికి ఘన నివాళి

కడప కల్చరల్, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): మైనంపాటి వెంకటసుబ్రహ్మణ్యం మేటి చిత్రకారుడని వైవీయూ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య టి.శ్రీనివాస్ కొనియాడారు. గురువారం సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో మైనంపాటి వెంకట సుబ్బహ్మణ్యం జయంతిని నిర్వహించారు. ముందుగా మైనంపాటి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లలితకళల్లో ప్రావీణ్యం కలిగిన మైనంపాటి కుంచెపట్టి భారతి పత్రికలో లభించిన బ్రౌన్ తండ్రి డేవిడ్ బ్రౌన్ ఛాయాచిత్రం ఆధారంగా సంవత్సరం పాటు శ్రమించి సీపీ బ్రౌన్ ఊహా చిత్రాన్ని చిత్రించారన్నారు. కార్యక్రమంలో బి.గోపాలకృష్ణశాస్త్రి, చింతకుంట శివారెడ్డి, హరిభూషణరావు, రమేష్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పలు కుటుంబాలు టీడీపీలో చేరిక


కండువా వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న బీటెక్ రవి

పులివెందుల, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): పులివెందుల పట్టణంలో పలు కుటుంబాలు నియోజకవర్గ ఇన్‌చార్జి బీటెక్ రవి ఆధ్వర్యంలో టీడీపీలో చేరాయి. శ్రీరామ థియేటర్, రాఘవేంద్ర థియేటర్ ప్రాంతానికి చెందిన కొంగనపల్లె శ్రీనివాసులు, కృష్ణవేణి, ఫిజియోథెరపీ డాక్టర్ వెంకటసాయికిశోర్, శ్రీనివాసులరెడ్డి, తులశమ్మ, మహమ్మద్‌రఫి, నూర్‌బాష, బీబీలతో పాటు 20 కుటుంబాలు, వెంకటేశ్వరరెడ్డితో సహా మరో 40 కుటుంబాలు టీడీపీలో చేరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పార్థసారధిరెడ్డి, తూగుట్ల సిద్దారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, వెంకటరామిరెడ్డి, హజ్ కమిటీ డైరెక్టర్ మహబూబ్ బాష పాల్గొన్నారు.

ఎంపీహెచ్‌డబ్ల్యూ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

కడప కలెక్టరేట్, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి) మల్టీపర్పస్ హెల్త్ వర్కర్స్ (ఫిమేల్) రెండేళ్ల కోర్సులో ప్రవేశం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ నాగరాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలోని ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు కళాశాలల్లో శిక్షణ ఇస్తామనని పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, దరఖాస్తుల పరిశీలన అనంతరం అక్టోబరు 15న ఎంపికైన జాబితాను ప్రచురిస్తామని వివరించారు. వివరాలకు డీఎంఅండ్‌హెచ్‌వో కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

ఎర్ర దుంగలు స్వాధీనం.. నలుగురు అరెస్ట్


వివరాలు తెలుపుతున్న డీఎస్పీ రాజేంద్రప్రసాద్, స్వాధీనం చేసుకున్న దుంగలు

మైదుకూరు రూరల్, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): దువ్వూరు మండలంలో 42 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని నలుగురిని అరెస్ట్ చేసినట్లు మైదుకూరు డీఎస్పీ రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. బుధవారం స్థానిక డీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దువ్వూరు మండలంలోని నీలాపురం గ్రామం సమీపంలోని చెరువు వద్ద అక్రమరవాణాకు సిద్ధంగా ఉంచిన 42 ఎర్రచందనం దుంగలను ముందస్తు సమాచారం మేరకు పోలీసులు గుర్తించగా, స్మగ్లర్లు పోలీసులపై రాళ్లదాడి చేశారన్నారు. అయితే పోలీసులు చాకచక్యంగా వారిని వెంబడించి పట్టుకొన్నారన్నారు. పోలీసులు అదుపులోకి తీసుకున్న వారిలో ప్రస్తుతం హైదరాబాద్‌లో నివాసం ఉంటున్న తమిళనాడుకు చెందిన రాజేంద్ర కుమారన్, దువ్వూరు మండలం దాసరిపల్లెకు చెందిన ముత్తూరు బసప్ప, నీకే దిన్నెకు చెందిన సయ్యద్ దర్బార్ బాష, కడప టౌన్ రవీంద్రనగర్‌కు చెందిన సయ్యద్ అబ్దుల్లా ఉన్నారన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరిచినట్లు డీఎస్పీ తెలిపారు. స్మగ్లర్లను పట్టుకోవడంలో కృషి చేసిన సీఐ శివశంకర్, ఎస్ఐ వినోద్‌కుమార్‌లను డీఎస్పీ అభినందించారు.

ఓయి గణాధిపా.... నీకు మ్రొక్కెదన్

తొండము నేకదంతమును దోరపు బొజ్జయు, వామహస్తమున్ మెండుగమ్రోయు గజ్జలును, మెల్లని చూపులు మందహాసమున్ కొండక గుజ్జురూపమున కోరిన విద్యలకెల్ల నొజ్జవై యుండెడి పార్వతీ తనయా ఓయి గణాధిపా నీకు మ్రొక్కెదన్ అంటూ ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు, వాడవాడలా ప్రజలు గణాధిపతిని స్తుతిస్తూ మొక్కారు. బుధవారం వేకువనే స్నానాలాచరించి వివిధ రూపాల్లో ఉన్న వినాయక ప్రతిమలను వేదికలపై కొలువు దీర్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలంకరించిన స్వామి వారికి వివిధ రకాల పండ్లు, పూలు సమర్పించి వేదపండితులు శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు చేశారు. గణపతిబప్పా మోరియా, జైజై గణపతి అంటూ వాడవాడలూ మార్మోగాయి. పీలేరు చెన్నారెడ్డి కాలనీ శివాజీ సెంటర్‌లో పేపర్ గుజ్జుతో ప్రత్యేకంగా తయారు చేయించిన భారీ వినాయకుడిని ప్రతిష్ఠించారు. సైనిక్ నగర్‌లో ఏర్పాటు చేసిన 23 అడుగుల భారీ వినాయకుడు ఆకట్టుకున్నాడు. వాల్మీకిపురంలో మహావిష్ణువు అవతారంలో వినాయక ప్రతిమ ప్రతిష్ఠించారు. తంబళ్లపల్లెలో తోలుబొమ్మలాట ప్రదర్శించారు. ప్రతిమలను ఆదివారం సామూహిక ర్యాలీ అనంతరం నిమజ్జనం చేయనున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. వివరాల్లోకెళితే...




పీలేరు సైనిక్ నగర్‌లో 23 అడుగుల భారీ వినాయకుడు - ఛత్రపతి శివాజీ సెంటర్‌లో పూజలు చేస్తున్న ప్రజలు

పీలేరు, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): మండల ప్రజలు బుధ, గురువారాల్లో వినాయక చవితి పండుగను వేడుకగా చేసుకున్నారు. విఘ్నేశ్వరుడు కొలువుదీరిన ఆలయాలను కుటుంబ సమేతంగా దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు వివిధ ఆలయాల్లోని నాగుల పుట్టకు పాలు పోసి, నోము దారాలు కట్టుకున్నారు. మండలంలో అధికారికంగా 182 కేంద్రాల్లో, మరో 30 కేంద్రాల్లో అనధికారికంగా వినాయక ప్రతిమలను ప్రతిష్ఠించారు. పట్టణమంతా వినాయకుడి భక్తిగీతాలు, స్తోత్రాలతో మార్మోగింది. ఉత్సవాల్లో రెండో రోజు నిర్వాహకులు అన్నదానం చేశారు. కార్యక్రమాల్లో ఆయా ప్రాంతాల్లోని ముస్లింలు



వివేకానంద సర్కిల్‌లో పార్వతీ సమేతంగా...

కూడా భాగస్వాములయ్యారు. పిల్లలు, బంధువులతో ఊరూవాడా కళకళలాడింది.

ఆకట్టుకున్న పేపర్ గుజ్జు గణపతి

చెన్నారెడ్డి కాలనీ శివాజీ సెంటర్‌లో ఏర్పాటు చేసిన పేపర్ గుజ్జుతో తయారు చేసిన వినాయక ప్రతిమ ఆకట్టుకుంది. రూ.1.15 లక్షలతో కడప జిల్లా ప్రొద్దుటూరులో పర్యావరణ హితంగా తయారు చేసిన భారీ వినాయకుడిని ప్రతిష్ఠించారు. ప్రతిమ నిమజ్జనం చేసిన గంటలో పూర్తిగా కరిగిపోతుందని నిర్వాహకులు తెలిపారు. సైనిక్ నగర్, వివేకానంద కూడళ్లలో ఏర్పాటు చేసిన భారీ ప్రతిమలు ఆకట్టుకున్నాయి. నెహ్రూ బజారులో స్వర్ణకారుల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విష్ణుమూర్తి అవతార వినాయకుడు, శివాలయం సెంటర్‌లో ఏర్పాటు చేసిన కాళీయుడిపై నాట్య వినాయకుడి ప్రతిమలు విశేషంగా అలరించాయి. సుధాసుధీర్ వీధిలో హిందూ, ముస్లింలు సంయుక్తంగా బంకమట్టితో తొమ్మిది అడుగుల ప్రతిమను రూపుదిద్ది ప్రతిష్ఠించారు.

బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో....

చవితి ఉత్సవాల్లో భాగంగా గురువారం సాయంత్రం స్థానిక బ్రాహ్మణ సంఘం సభ్యులు వినాయక నిమజ్జనం చేశారు. శివరామాపురంలోని భ్రమరాంబిక సమేత మల్లికార్జున స్వామి ఆలయం వద్ద గార్గేయ నదిలో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో బ్రాహ్మణ సంఘ ఉపాధ్యక్షుడు తెనాలి రామ సుబ్రహ్మణ్యం, కార్యదర్శి ఉద్యా ఫణీంద్ర శర్మ, సభ్యులు ప్రభాకరరావు, వెంకటేశ్వర్లు, మయూర్‌నాథ్, విరూపాక్షం కాశీనాథ్, నరసింహమూర్తి, అప్పయ్యభట్ట శ్రీధర్, కృష్ణప్రసాద్, టీచర్ ప్రసాద్, చంద్రశేఖర స్వామి, కరణం రామ్మూర్తి, సత్యనారాయణ రావు, ఆంజనేయశర్మ, తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకిపురంలో ఆకట్టుకున్న గణపతులు

వాల్మీకిపురం, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా చవితి వేడుకలను వైభవంగా చేసుకున్నారు. గ్రామగ్రామాన మండపాలను ఏర్పాటు చేసి గణపతి ప్రతిమలను ఏర్పాటు చేసి విశేషాలంకరణలతో పూజలు చేశారు. మండలం మొత్తం దాదాపు వంద ప్రతిమలను ఏర్పాటు చేసి వేడుకలు చేసుకున్నారు. కొత్తపేట వీధిలో మహావిష్ణు వినాయకుడు, కూరపర్తి గ్రామంలో మహాబాల వినాయకుడు (2.0 బుల్లి గణపతి 6అడుగులు) ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మహిళలు పుట్టను పూజించి నాగు రాళ్లకు పూజలు చేశారు. సీఐ రాఘవరెడ్డి, ఎస్ఐ చంద్రశేఖర్ ప్రతిమల మండపాలను పర్యవేక్షిస్తున్నారు.

గుర్రంకొండలో....

గుర్రంకొండ, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): చవితి వేడుకలను పట్టణ, గ్రామీణ ప్రజలు భక్తిశ్రద్ధలతో చేసుకున్నారు. వినాయక మండపాలను రంగు రంగుల విద్యుత్ దీపాలు, పూలతో అలంకరించారు. ప్రజలు వినాయక ప్రతిమలకు పూజలు చేసి తీర్థప్రసాదాలను స్వీకరించారు. భక్తులకు ఆయా మండపాల వద్ద అన్నదానం చేశారు.

కలకడలో....

కలకడ, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): మండల ప్రజలు చవితి వేడుకలు చేసుకున్నారు. కలకడ, ఎర్రయ్యగారిపల్లె, కోన, బాటవారిపల్లెతోపాటు వివిధ గ్రామాల్లో వినాయక ప్రతిమలను ఏర్పాటు చేసి పూజలు చేశారు. ఇళ్లలో గణపయ్యలను ఏర్పాటు చేసి పూజలను చేశారు. టమోటా మార్కెట్‌లో స్వామి వారికి నైవేద్యంగా ఏర్పాటు చేసిన లడ్డును వైఎస్ఎన్ మండీ యజమాని రూ.82 వేలకు వేలంలో దక్కించుకున్నాడు.



తంబళ్లపల్లెలో తోలు బొమ్మలాటను తిలకిస్తున్న ప్రజలు

మదనపల్లెలో అలరించిన గణపతులు

మదనపల్లె టౌన్/అర్బన్, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రధాన కూడళ్లు, పురవీధుల్లో వినాయక మండపాలు ఏర్పాటు చేసి నిర్వాహకులు ప్రతిమలను ప్రతిష్ఠించారు. కమ్మవీధిలో మిట్స్ డీమ్డ్ యూనివర్సిటీ యాజమాన్యం విజయభాస్కర్ చౌదరి ఆధ్వర్యంలో వినాయక ప్రతిమను ప్రతిష్ఠించారు. సుభాష్‌రోడ్డు, కమ్మగడ్డవీధి, త్యాగరాజు వీధి, ఆర్యవైశ్య హాస్టల్, ఈశ్వరమ్మకాలనీ, అమ్మినేనివీధి, ప్రశాంత్‌నగర్, సరస్వతీ నగర్, చంద్రా కాలనీల్లో తీర్చిదిద్దిన వినాయక ప్రతిమలు ఆకట్టుకున్నాయి. నియోజకవర్గ ప్రజలు సుఖ, సంతోషాలతో ఉండాలని ఎమ్మెల్యే షాజహాన్‌బాష ఆకాంక్షించారు. కమ్మగడ్డవీధిలో తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరాం చినబాబు, నియోజకవర్గ అధ్యక్షుడు నాదెండ్ల అరుణ్‌కుమార్, మాజీ కౌన్సిలర్ బాబునాయుడు, టౌన్ అధ్యక్షుడు ప్రణయ్, అఖిల్, మహబైట్‌కాన్, బండి అమర, వరప్రసాద్, గగన్, బీజేపీ నేత శ్రీకాంత్ పూజలు చేశారు. మార్వారివీధిలో ప్రత్యేకంగా డెకరేషన్ చేయగా, రెడ్డీస్ కాలనీ, రెడ్డెప్ప నాయుడు కాలనీల్లో పెద్ద ప్రతిమలను ప్రతిష్ఠించారు. సీటీఎం, కొత్తవారిపల్లె కోళ్లబైలు, చిప్పిలి, వేంపల్లె, చీకలబైలు, కొండామరిపల్లె, తట్టివారిపల్లె గ్రామాల్లో చవితి వేడుకలు నిర్వహించారు. టీడీపీ నేతలు బంగారు రామకృష్ణ, సిమెంట్ రమణ, మిట్స్ వర్సిటీ చాన్సలర్ నాదెళ్ల విజయ భాస్కర చౌధరి, ద్వారకనాథ్, విద్యాసాగర్, రాటకొండ మధుబాబు, పూల విజయమ్మ, విజయభారతి స్కూల్ కరెస్పాండెంట్ ఎన్.సేతు, నిశ్చిత, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి యల్లంపల్లె ప్రశాంత్, ఓంప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



అంగళ్లులో ప్రతిష్ఠించిన వినాయకుడు



కమ్మగడ్డవీధిలో తెలుగు యువతరాష్ట్ర అధ్యక్షుడు శ్రీరాం చినబాబు

10 కిలోల లడ్డు బహూకరణ

నిమ్మనపల్లి, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): జాండ్రబైలులో వెలసిన వినాయక ప్రతిమకు గ్రామస్తుడు గోవర్ధన్‌రెడ్డి 10 కిలోల కాణిపాకం లడ్డూను వితరణ చేశారు. మండలంలోని దాదాపు అన్ని గ్రామాల్లో చవితి వేడుక లను ఘనంగా నిర్వహించారు. మండలంలో 150కి పై గా వినాయక ప్రతిమలు ఏర్పాటు చేశారు.

వేడుకగా చవితి వేడుకలు

పెద్దమండ్యం, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రజలు వినాయక చవితి పండుగను భక్తి శ్రద్ధలతో చేసుకున్నారు. పెద్దమండ్యం, పాపేపల్లి, సి.గొల్లపల్లి, కలిచెర్ల, బండమీద పల్లి, శివపురం, ఎన్‌ఓపల్లి, ముసలికుంట, బండ్రేవు, మందలవారిపల్లి, కోటకాడపల్లి, వెలిగల్లు, సిద్దవరం, శివపురం తదితర గ్రామాల్లో మండపాలు ఏర్పాటు చేసి వినాయక ప్రతిమలను ఏర్పాటు చేశారు.

తంబళ్లపల్లెలో...

తంబళ్లపల్లె, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా చవితి వేడుకలను ప్రజలు వైభవంగా చేసుకున్నారు. పండుగ రోజు ఇళ్లలో బుజ్జి గణపయ్య ప్రతిమలను ప్రతిష్ఠించి పిండి వంటలు నైవేద్యంగా సమర్పించి పూజలు చేశారు. పాత కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన ధూల్‌పేట్ వినాయకుడు ఆకట్టుకున్నాడు. సాయంత్రం ట్రస్టు సభ్యులు ఏర్పాటు చేసిన తోలుబొమ్మలాట ప్రదర్శన విశేషంగా అలరించింది. మండపం వద్ద తంబళ్లపల్లె విద్యుత్ అధికారులు అన్నదానం చేశారు.

ములకలచెరువులో...

ములకలచెరువు, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): మండలంలో వాడవాడలా వినాయక ప్రతిమ లు ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు చేపట్టారు. పీటీఎం రోడ్డులో ఏర్పాటు చేసిన భారీ వినా యక ప్రతిమ వద్ద మార్కెట్ కమిటీ కార్యదర్శి నవీన్ కుమార్‌రెడ్డి పూజలు చేశారు. బురకాయల కోట, మద్దినాయనిపల్లె, దేవళచెరువు, వేపూరికోట, పెద్ద పాళ్యం, నాయనిచెరువుపల్లె, కదిరినాథునికోట, చౌడసముద్రం, కాలువపల్లె, గుడుపల్లె, పర్తికోట, సోంపల్లె తదితర గ్రామా ల్లో ప్రతిమలు ఏర్పాటు చేశారు.

కురబలకోటలో...


కురబలకోట, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): మండ లంలో వాడవాడలా చవితి వేడుకలను నిర్వహిం చారు. అంగళ్లు, కురబలకోట, ముదివేడు, మట్లివారిపల్లె తదితర గ్రామాల్లో వినాయక ప్రతిమలను ప్రతిష్ఠించి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మిట్స్ యూనివర్శిటీ చాన్సెల ర్ విజయభాస్కర్ చౌదరి ఆధ్వర్యంలో పండి తుల మంత్రోచ్చారణ నడుమ ప్రతిమను ప్రతి ష్ఠించి వేడుకలను నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదా లను అందజేశారు. ఈ వేడుకల్లో కులమతాలకు అతీతంగా హిందు, ముస్లిం ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొ ని స్వామివారిని దర్శించు కున్నారు. టీడీపీ పార్లమెంటరీ బీసీ సెల్ అధ్యక్షుడు సురేంద్రయాదవ్, టీడీపీ నేత సీతారామ్, సర్పంచ్ విశ్వనాథరెడ్డి, వీఆర్వో అంజికుమార్, దామోదర్‌రెడ్డి, హరి, రమణ, విజయ్, మునీష్ తదితరులు పాల్గొన్నారు.


ఘనంగా చవితి వేడుకలు

బి.కొత్తకోట, ఆగస్టు28(ఆంధ్రజ్యోతి): నగరపం చాయతీ, మండల వ్యాప్తంగా చవితి వేడుకల ను ఘనంగా నిర్వహించుకున్నారు. పట్టణం లోని పీటీఎంరోడ్డు, బీసీకాలనీ, కరెంట్‌కాలనీ, పాశంవీధి, వైశ్యబజార్, బైపాస్‌రోడ్డు తదితర ప్రాంతాల్లో వినాయక మంటపాలు ఏర్పాటు చేసి, ప్రతిమలను ప్రతిష్ఠించారు. డీజే మ్యూజిక్‌తో యువత నృత్యాలు చేస్తూ చిందులేశారు.



వాల్మీకిపురం తోటవీధిలో....






గుర్రంకొండ కొత్తపేటలో - పెద్దమండ్యంలో - బి.కొత్తకోటలో కొలువైన వినాయక ప్రతిమలు - నిమ్మనపల్లిలో 10 కిలోల కాణిపాకం లడ్డును బహూకరిస్తున్న గోవర్ధన్ రెడ్డి

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవు : డీఎస్పీ మహేంద్ర



మాట్లాడుతున్న మదనపల్లి డీఎస్పీ మహేంద్ర

పెద్దమండ్యం, ఆగష్టు 28(ఆంధ్ర జ్యోతి): గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని మదనపల్లి డీఎస్పీ మహేంద్ర హెచ్చరించారు. మండలంలో గురువారం డీఎస్పీ పర్యటించారు. పెద్దమండ్యం, కలిచెర్ల, తురకపల్లి, వెలిగల్లు గ్రామాల్లో ఏర్పాటు చేసిన వినాయక ప్రతిమల మండలపాల వద్ద ప్రజలకు సలహాలు ఇచ్చారు. అనంతరం పోలీసు స్టేషన్లను తనిఖీ చేసి, పలు కేసుల రికార్డులను పరిశీలించి మాట్లాడుతూ వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసిన వినాయక ప్రతిమల మండపాల పోలీసుల పర్యవేక్షణ సారించాలన్నారు. మండలంలో గతేడాది నిమజ్జన సమయంలో జరిగిన సంఘటనపై జాగ్రత్తలు పాటించాలన్నారు. మండలంలో సమస్యాత్మక గ్రామాలపై ఆరా తీశారు. డీఎస్పీ వెంట ములకలచెరువు సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ వెంకటేశ్వర్లు, పోలీసులు సిబ్బంది పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని నిరసన

ములకలచెరువు, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని డిమాండ్ చేస్తు గురువారం సీపీఐ నేతలు నిరసన వ్యక్తం చేశారు. స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట ప్రజా సంఘ నేతలతో కలిసి ఆందోళన చేపట్టారు. సీపీఐ మండల కార్యదర్శి అంజనప్ప, రైతు సంఘం నియోజకవర్గ సహాయ కార్యదర్శి మల్లికార్జున, ఏఐఎస్ఎఫ్ నేత గణేష్ మాట్లాడుతూ బోరు బావులకు విద్యుత్ స్మార్ట్ మీటర్ల పేరుతో రైతులపై మోయలేని భారం మోపాలని చూస్తున్నారన్నారు. కార్యక్రమంలో నేతలు శంకరమ్మ, పాపులమ్మ, రాధిక, సుబ్బన్న, రెడ్డప్ప, గంగులప్ప, ఎల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

బీజేపీని బలోపేతం చేయాలి

తంబళ్లపల్లె, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): గ్రామగ్రామాన బీజేపీని బలోపేతం చేయడానికి కృషి చేద్దామని బీజేపీ నేత గోల్డెన్ వ్యాలీ రమణారెడ్డి అన్నారు. బుధవారం తంబళ్లపల్లెలో బీజేపీ నేతలు, కార్యకర్తలతో సమీక్షించిన ఆయన మాట్లాడుతూ పార్టీ బలోపేతం బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందన్నారు. రానున్న సంస్థాగత ఎన్నికల్లో బీజేపీ గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు వెంకట్రమణ, మాజీ మండలాధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, మగ్గాలు లక్ష్మయ్య, కో-కన్వీనర్ శంకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి హరినాథరెడ్డి, యుగంధర్, సీనియర్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కమనీయం లక్ష్మీనరసింహుడి కల్యాణోత్సవం



శివాలయంలో కల్యాణోత్సవం నిర్వహిస్తున్న వేదపండితులు

పెద్దతిప్పసముద్రం ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ప్రసన్న పార్వతీ సమేత విరూపాక్షేశ్వర స్వామి ఆలయంలో గురువారం లక్ష్మీనరసింహుడి కల్యాణోత్సవం కమనీయంగా నిర్వహించారు. స్వాతి నక్షత్రం సందర్భంగా ఆలయంలో సాయంత్రం స్వామి వారి ఉత్సవ మూర్తులను అలంకరించి కర్ణాటక రాష్ట్ర వేదపండితులు వేణుగోపాల శర్మ, ఎంఎస్ శేషాచలం శర్మ వారు కల్యాణోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. స్వామి వారి కల్యాణాన్ని తిలకించేందుకు అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.

రేపు స్త్రీశక్తి విజయోత్సవ సభ

పీలేరు, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): పీలేరులో శనివారం ఉదయం స్త్రీశక్తి విజయోత్సవ సభ నిర్వహించనున్నట్లు మండల టీడీపీ అధ్యక్షుడు వారణాశి శ్రీకాంత్ రెడ్డి పేర్కొన్నారు. స్థానిక మార్కెట్ కమిటీ ఆవరణలో శనివారం ఉదయం 10 గంటలకు జరిగే విజయోత్సవ సభలో ఎమ్మెల్యే నల్లారి పాల్గొంటారని, నియోజకవర్గంలోని అన్ని మండలాల పార్టీ అధ్యక్షులు, గ్రామ, పట్టణ కమిటీ అధ్యక్షులు, క్లస్టర్ ఇన్‌చార్జులు, బూత్ కన్వీనర్లు, ప్రజాప్రతినిధులు, టీడీపీ, నల్లారి అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన గురువారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

వివాదాస్పద భూమిలో ప్రవేశిస్తే కఠిన చర్యలు

బి.కొత్తకోట, ఆగస్టు(ఆంధ్రజ్యోతి): సర్వే నెంబర్ 239 వివాదాస్పద భూమి అని అందులో ఎవరు ప్రవేశించినా అది దురాక్రమణగా భావించి కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ బావాజాన్ హెచ్చరించారు. గతంలో కొందరు వర్కింగ్ జర్నలిస్టులకు ఇంటిపట్టాలు మంజూరు చేయగా ఆ స్థలంలో తమకు హక్కు వుందంటూ కొందరు వ్యక్తులు అడ్డు తగిలారు. దీనిపై కోర్టులో వ్యవహారం నడుస్తోంది. ఈ నేపథ్యంలో తాజాగా ఓ వ్యక్తి ట్రాక్టర్‌తో ఈ పొలంలో కొంతభాగం దున్నడంతో జర్నలిస్టులు గురువారం తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో తహసీల్దార్ ఆదేశాల మేరకు ఆర్ఐ రామాంజనేయులు, వీఆర్వో శ్రీరాములు స్థలాన్ని పరిశీలించారు. 239లో 1.15 ఎకరాలు ప్రభుత్వ భూమి అని ఎవరూ ప్రవేశించరాదని అన్నారు

గట్టు జడ్పీ హైస్కూల్ ఆకస్మిక తనిఖీ



హైస్కూల్‌లో తనిఖీ చేస్తున్న విశ్వనాథ్

బి.కొత్తకోట, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మండల స్పెషలాఫీసర్, జిల్లా దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ విశ్వనాథ్ గట్టు జడ్పీ హైస్కూల్‌ను ఆకస్మిక తనిఖీ చేపట్టారు. మధ్యాహ్నభోజన పథకం అమలు, విద్యార్థుల అభ్యసనా సామర్థ్యంపై విచారించారు. పాఠశాలకు విడుదలైన గ్రాంట్లు, వినియోగంపై ఆరా తీశారు. విద్యార్థులతో విడిగా మాట్లాడి ఉపాధ్యాయుల పనితీరు, బాలికల పట్ల వారి ప్రవర్తనపై అభిప్రాయాలను సేకరించారు. మండలంలోని ఆస్పత్రులు, పాఠశాలల నిర్వహణ, సిబ్బంది పనితీరుపై తనిఖీ చేసి నివేదిక సమర్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం లలితకుమారి, క్లస్టర్ సిబ్బంది పాల్గొన్నారు.

పెండింగ్ ఇళ్లను త్వరగా పూర్తి చేయాలి



ప్రభుత్వ ఇళ్లను పరిశీలిస్తున్న ఎంపీడీఓ రమేష్, తదితరులు

నిమ్మనపల్లి, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): మండలంలో పెండింగ్‌లో వున్న ప్రభుత్వ ఇళ్లను త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీఓ రమేష్ అన్నారు. గురువారం మూష్టూరు పంచాయతీ దిగువపల్లిలో పెండింగ్ ఇళ్లను పరిశీలించిన ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఇళ్ల నిర్మాణాలు నిర్దిష్ట సమయానికి పూర్తి చేయాలని లేక పోతే రద్దు చేస్తామన్నారు. ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీలకు అదనంగా డబ్బు మంజూరు చేసినా లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు చేపట్టకపోవడం అధికారుల నిర్లక్ష్యమేనన్నారు. ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు లబ్ధిదారుని ఇంటికి తిరిగి ఇళ్ల నిర్మాణాలు చేపట్టేలా చైతన్యం తెచ్చి త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ బాలరాజు, హౌసింగ్ ఏఈ అమరనాద్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ వరప్రసాద్ లబ్ధిదారులు పాల్గొన్నారు.

వెల్నెస్ సెంటర్‌పై దాడి

బి.కొత్తకోట, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): బైపాస్‌రోడ్డులో ఉన్న సచివాలయం-1 వెల్నెస్ సెంటర్ (విలేజ్ క్లినిక్)పై రాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేశారు. సూచిక బోర్డు, తలుపులను ఇటుకలతో ధ్వంసం చేశారు. క్లినిక్ ప్రాంగణం అంతా ఇటుకలు పగులగొట్టి హంగామా చేశారు. ఈ విషయమై అక్కడి ఎంఎల్‌హెచ్‌పీ స్వాతి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ గోపాల్‌రెడ్డి విచారణ చేపట్టారు. సీసీకెమెరాల ఫుటేజ్‌ను పరిశీలించి నిందితులను గుర్తిస్తామన్నారు. ప్రైవేటు అద్దె భవనంలో నడుస్తున్న ఈ విలేజ్ క్లినిక్‌ను కొందరు యువకులు సొంత నిధులతో ఖాళీగా ఉన్న ప్రభుత్వ భవనానికి మరమ్మతులు చేసి అందులోకి ఇటీవలే మార్చారు. ఈ నేపథ్యంలో దాడి జరగడం చర్చనీయాంశమైంది.

'బోయకొండ' పాలకమండలికి 115 దరఖాస్తులు

చౌడేపల్లె, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రం బోయకొండ గంగమ్మ ఆలయ పాలక మండలి సభ్యత్వం కోసం 115 దరఖాస్తులు వచ్చినట్లు ఈఓ ఏకాంబరం పేర్కొన్నారు. సెప్టెంబరు ఒకటిన దరఖాస్తుదారులకు బోయకొండ ఆలయ కార్యాలయంలో ఉదయం 10.30గంటల నుంచి సర్టిఫికెట్ల పరిశీలన ఉంటుందన్నారు. దరఖాస్తుదారులందరూ హాజరవాలని కోరారు.

పారిశుధ్యంపై నిర్లక్ష్యం వద్దు

పీలేరు రూరల్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్య కార్యక్రమాల నిర్వహణలో నిర్లక్ష్యం తగదని పీలేరు ఎంపీడీఓ శివశంకర్ తెలిపారు. గురువారం పట్టణంలో జరిగిన ఇంటింటి చెత్తసేకరణలో ఆయన మాట్లాడుతూ శానిటేషన్‌లో ఎటువంటి మినహాయింపులు ఉండవన్నారు. పట్టణం, గ్రామాల్లో సైతం రోజూ చెత్తసేకరణ తప్పనిసరన్నారు. అధికారులు, పంచాయతీ కార్యదర్శులు చెత్త సేకరణపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.